


# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY








SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE


సంపుటి : 07 | సంచిక : 322 | అమలాపురం | ఎడిటర్ :కె. సునీల్‌కుమార్ | గురువారం | 11 జూలై 2024 | పేజీల : 12 | వెల : 2/-


## సంపన్నులో.. భారత్ సంచలనం




**న్యూఢిల్లీ, విశ్వంవాయిస్ న్యూస్** : భారత్ లో ఇటీవల జరిగిన ఎన్నికల సందర్భంగా సైన్స్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్యామ్ పిట్రోడా చేసిన వ్యాఖ్యలు గుర్తున్నాయా...? "సంపద పన్ను" అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ ను పూర్తిగా డిఫెన్స్‌లో పడేశాయి. అంతేకాదు.. పిట్రోడాను ఆ పార్టీ బాధ్యతల **మిగతా 2లో..**

## డెక్కన్ క్రానికల్ ఆఫీస్‌పై దాడి




**అమరావతి, విశ్వంవాయిస్ న్యూస్** ఏపీలో తాజాగా ఓ మీడియా సంస్థపై దాడి జరిగింది. ఇందులో భాగంగా... "విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై కూటమి యూటర్న్" అని అంటూ ఓ ఆంగ్ల దినపత్రికలో కథనం ప్రచురితమవ్వడమే ఈ దాడికి కారణం అని తెలుస్తోంది. ఈ దాడికి **మిగతా 2లో..**

## రేవంత్ బూచి రాజకీయం !



**హైదరాబాద్, విశ్వంవాయిస్ న్యూస్** ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శిష్యుడు రేవంత్ తెలంగాణలో ముఖ్యమంత్రి అయ్యాడు. ఏపీ ఎన్నికల్లో ఘనవిజయం సాధించి చంద్రబాబు నాలుగోసారి ముఖ్యమంత్రి అయ్యాడు. కాంగ్రెస్ కు వ్యతిరేకంగా పుట్టిన టీడీపీ నుండి కాంగ్రెస్‌లో చేరిన **మిగతా 2లో..**

# ఏపీ ఆర్థిక పరిస్థితి లోతుల్లోనే..!



హామీలు నెరవేర్చగలరా..?

**అమరావతి, విశ్వంవాయిస్ న్యూస్**

ఏపీలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఈ నెల 12కి సరిగ్గా నెల రోజులు అవుతుంది. అంటే ప్రజలు ఇచ్చిన మొత్తం అరవై నెలల అధికారంలో ఒక నెల గడచినట్లే. ఈ నెల రోజులలో కొత్త ప్రభుత్వం ఏమి చేసింది అంటే కీలకమైన రంగాలకు సంబంధించి శ్వేత పత్రాలు రిలీజ్ చేశారు. అయితే ఏ శ్వేత పత్రం చూస్తే ఏముంది కొత్తదనం అంతా ప్రగతి నిరోధకం అన్న డైలాగు నే కూటమి పెద్దల నుంచి వస్తోంది. ఇక ఏది చేయాలన్నా డబ్బు ఉండాలి. ఆర్థికంగా బలంగా లేకపోతే ఆలోచనలు వేయి ఉన్నా అడుగు ముందుకు వేయలేరు. మరోవైపు చూస్తే ఏపీ ఆర్థిక పరిస్థితి మీద కూడా కూటమి ప్రభుత్వం పెద్దలు మల్లగుల్లాలు పడుతున్నారు. బయట నుంచి చూసినది వేరు ప్రభుత్వంలోకి వచ్చాక దిగేదాకా లోతులు తెలుస్తున్నాయని అంటున్నారు. చంద్రబాబు ఆర్థిక రంగం మీద సమీక్ష చేస్తున్నారు. అయితే ఆర్థిక రంగం పరిస్థితి ఇంకా అంతు చిక్కనిదిగానే ఉంది అని అంటున్నారు. అప్పులు చూస్తే ఏకంగా 14 లక్షల కోట్ల రూపాయలుగా ఉండవచ్చు అని కూడా అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో కొత్త ప్రభుత్వానికి అన్నీ సవాళ్ళుగానే కనిపిస్తున్నాయి. ఎలా అడుగు ముందుకు వేయాలి అన్న దాని మీద కూడా తర్జన భర్జన పడుతున్నారు. మరోవైపు చూస్తే ఈసారి పూర్తి బడ్జెట్ ప్రవేశపెడతారా అన్నది కూడా తెలియడం లేదు బడ్జెట్ లో అనేక రంగాలకు కేటాయింపులు చేయాలి. అలాగే సంక్షేమ పథకాలకు కూడా నిధులు చూసుకోవాలి. దాంతో **మిగతా 2లో..**

### ముఖ్యమంత్రి చంద్రబాబు


# మూడో శ్వేత పత్రం!

## వెలుగులోకి కీలక విషయాలు

**అమరావతి, విశ్వంవాయిస్ న్యూస్** : ఆంధ్రప్రదేశ్ లో అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పులపై దృష్టి సారించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వరుసగా కీలక అంశాలపై ఆయన శ్వేత పత్రాలు విడుదల చేస్తున్నారు. ఇప్పటికే పోలవరం ప్రాజెక్టు, రాజధాని అమరావతిలపైన శ్వేత పత్రాలు విడుదల చేశారు. ఇప్పుడు కీలకమైన విద్యుత్ రంగంపైన చంద్రబాబు శ్వేతపత్రం విడుదల చేశారు. ఇందులో కీలక అంశాలను ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మీడియా, రాష్ట్ర ప్రజల దృష్టికి తెచ్చారు. జగన్ ప్రభుత్వ హయాంలో విద్యుత్ రంగం ఎదుర్కొన్న సంక్షోభం, వైఫల్యాలను చంద్రబాబు వివరించారు. గత ఐదేళ్లలో విద్యుత్ **మిగతా 2లో..**



# జనసేనకే కీలక పదవి



**అమరావతి, విశ్వంవాయిస్ న్యూస్** : ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం సమన్వయంతో ముందుకు వెళ్తోంది. ప్రభుత్వం కీలక పదవులు, నామినేటెడ్ పోస్టుల భర్తీపైన దృష్టి సారించింది. అందులోనూ పొత్తు ఉన్న నేపథ్యంలో జనసేన పార్టీని కూడా చంద్రబాబు దృష్టిలో పెట్టుకుంటున్నారు. ఇప్పటికే శాసనమండలిలో రెండు ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ కాగా చెరో ఒకటి టీడీపీ, జనసేన పంచుకున్నాయి. టీడీపీ తరఫున సి.రామచంద్రయ్య, జనసేన తరఫున హరిప్రసాద్ ఎమ్మెల్సీలుగా ఎన్నికయ్యారు. అలాగే కీలకమైన అడ్వొకేట్ జనరల్ (ఏజీ)గా టీడీపీ తరఫున ముఖ్య కేసులు వాదించే దమ్మాలపాటి శ్రీనివాస్ ను నియమించారు. గతంలో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు ఒకసారి ఆయన ఏజీగా వ్యవహరించారు, ఇక అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ)గా జనసేన లీగల్ సెల్ చైర్మన్, ప్రముఖ న్యాయవాది ఇవన సాంబశివ ప్రతాప్ ను ఎంపిక చేశారు. ఇందుకు సంబంధించి రాష్ట్ర న్యాయశాఖ కార్యదర్శి వి.సునీత ఉత్తర్వులు జారీచేశారు. వాస్తవానికి అదనపు అడ్వొకేట్ జనరల్ పోస్టు కోసం టీడీపీ తరఫున కేసులు వాదించే సీనియర్ **మిగతా 2లో..**

# ముస్లిం మహిళలు భరణం!



## సుప్రీంకోర్టు కీలక తీర్పు!

**న్యూఢిల్లీ, విశ్వంవాయిస్ న్యూస్**

ముస్లిం మహిళలకు విడాకుల తర్వాత ఇచ్చే భరణం విషయంలో సుప్రీంకోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. ఇందులో భాగంగా విడాకుల తర్వాత ముస్లిం మహిళలు కూడా భరణానికి అర్హులని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇప్పుడు ఈ **మిగతా 2లో..**


# బీజేపీలోకి బుగ్గన!



**అమరావతి, విశ్వంవాయిస్ న్యూస్** : ఏపీలో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజయం పాలైన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా 11 అసెంబ్లీ స్థానాల్లోనూ, 4 లోక్ సభ స్థానాల్లోనూ విజయం సాధించింది. ఈ నేపథ్యంలో వైసీపీ నేతలు పలువురు పార్టీలు మారుతున్నారంటూ కీలక ప్రచారం తెరపైకి వచ్చిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా తొలుత వైసీపీ ఎంపీలు బీజేపీలో చేరడానికి ఉబలాటపడుతున్నారనే ప్రచారం బలంగా జరిగింది. ప్రధానంగా మిథున్ రెడ్డి ఆధ్వర్యంలో వీరంతా కాషాయ కండువా కప్పుకోబోతున్నరని, ఈ మేరకు పెద్దిరెడ్డిని కూడా ఒత్తిడి చేస్తున్నారని ఒక ప్రచారం తెగ వైరల్ గా మారింది. అయితే... దీనిపై మిథున్ రెడ్డి క్లారిటీ ఇచ్చారు. ఇదే సమయంలో అవినాష్ రెడ్డిని జగనే బీజేపీలోకి పంపుతున్నారంటూ మరో ప్రచారం సోషల్ మీడియాలో జోరుగా జరిగింది! దీనిపైనా నేతలు క్లారిటీ ఇచ్చారు.. ఈ వ్యవహారంపై జరుగుతున్న ప్రచారాన్ని ఖండించారు. ఈ నేపథ్యంలో "బీజేపీలోకి బుగ్గన!... చేరేందుకు విశ్వప్రయత్నాలు" అంటూ ఓ కథనం అచ్చైంది! అవును... వైసీపీ కీలక **మిగతా 2లో..**

# ట్రిపుల్ ఆర్ ఇన్ వైసీపీ !

**అమరావతి, విశ్వంవాయిస్ న్యూస్** : ట్రిపుల్ ఆర్ అంటే గభాలుగా మాజీ వైసీపీ ఎంపీ రెబెల్ నేత రఘురామ క్రిష్ణం రాజు అని అనుకునేరు. ఆయన కానే కాదు. ఈ ట్రిపుల్ ఆర్ వేరు. వీరు వైసీపీలో ఉన్నారు. కీలకమైన స్థానాలలో ఉన్నారు. వారే వైసీపీ తరఫున పార్లమెంట్‌లో కీలక హోదాలలో **మిగతా 2లో..**







### చంద్రబాబుకు షాకిచ్చిన

# విజయవాడ తమ్ముళ్లు

**అమరావతి, విశ్వంవాయిస్ న్యూస్** : టీడీపీ నాయకుల తీరు రాష్ట్రంలో ఒక్కొక్క చోట ఒక్కొక్క విధంగా ఉంది. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత.. కొందరు దూకుడు గా ఉంటే.. మరికొందరు మాత్రం సైలెంట్‌గా ఉంటున్నారు. క్షేత్రస్థాయిలోనూ పార్టీని పుంజుకునేలా కొందరు వ్యవహరిస్తే.. మరికొం దరు మాత్రం.. పార్టీఏమైనా ఫర్లేదులే.. అధికారంలోకి వచ్చేశాం.. కదా! అన్నధోరణిలో వ్యవహరిస్తున్నారు. దీంతో తమ్ముళ్ల స్టయిల్ ఒక్కొక్క చోట ఒక్కొక్క రకంగా ఉంది. ఇటీవల చిత్తూరు నగరపాలక సంస్థలో టీడీపీ కూటమి ఆదిపత్యం పెరిగేలా అక్కడ తమ్ముళ్లు వ్యవహరించారు. టీడీపీకి కేవలం ముగ్గురు మాత్రమే కార్పొరేటర్లు ఉన్నా.. వైసీపీ నాయకులను ఆకర్షించారు. దీంతో ఏకంగా 18 మంది వైసీపీ కార్పొరేటర్లు.. టీడీపీలోకి జంప్ చేశారు. దీంతో చిత్తూరు నగర పాలన అంతా కూడా ఇప్పుడు కూటమి చేతిలోకి వచ్చింది. ఇక, ఇప్పుడు విజయవాడ విషయానికి **మిగతా 2లో..**





# విశాఖ దశ తిరుగుతుందా?

**విశాఖపట్నం, విశ్వంవాయిస్ న్యూస్** : విశాఖకు దశ తిరుగుతుందా అన్న చర్చ సాగుతోంది. విశాఖ నగరం ఎన్నో సమస్యలతో ఉంది. అందులో విభజన తరువాత ఉన్నది కొత్తవి కలిపి చాలానే ఉన్నాయి. అవి ఏళ్లుగా పరిష్కారం కాకుండా అలాగే ఉన్నాయి. తాజాగా టీడీపీ కూటమిని ఏకగ్రీవంగా ఎన్నుకుని విశాఖ జిల్లా జై కొట్టింది. ఏజెన్సీలో రెండు ఎమ్మెల్యేలు ఒక ఎంపీ వైసీపీకి తప్ప ఉత్తరాంధ్ర మొత్తం కూటమి ఊడ్చి పారేసింది. దాంతో ఉత్తరాంధ్రాతో పాటు దాని ముఖద్వారంగా ఉన్న విశాఖ నగరం కూడా కూటమి పాలకులు కేంద్ర రాష్ట్రాల నుంచి విశాఖ సహా ఉత్తరాంధ్రకు ఏమి చేయబోతున్నారు అని ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. విశాఖకు ఒకే రోజున ఇద్దరు కీలక నేతలు విడిది చేయబోతున్నారు. కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్ డి కుమార స్వామి విశాఖనే తన తొలి పర్యటనగా ఎంచుకున్నారు. ఆయన విశాఖ స్టీల్‌ప్లాంట్‌ని **మిగతా 2లో..**

(మొదటిపేజీ తరువాయి)

## సంపన్నులోస.. భారత్‌లో సంచలనం

నుంచి తప్పించింది. చివరకు మళ్లీ చేర్చుకోవడం వేరే విషయం. అయితే, సంపద పన్ను వంటి ఆలోచనలు ఏమీ లేవని కాంగ్రెస్ వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. కాగా, పిట్రోడా.. అమెరికాలో అమల్లో ఉన్న వారసత్వ పన్ను భావనను వివరిస్తూ.. “అమెరికాలో వారసత్వపు పన్ను ఉంది. ఒక వ్యక్తి %వి%100 మిలియన్ల విలువైన సంపదను కలిగి ఉంటే అతడు లేదా ఆమె మరణించినప్పుడు మాత్రమే బదిలీ చేయగలరు. 45% తన పిల్లలకు పోగా 55% ప్రభుత్వం లాక్కుంటుంది. మీ తరంలో మీరు సంపాదించి వెళ్లిపోతున్నారు, మీ సంపదను ప్రజల కోసం వదిలివేయాలి, అందులో సగం. ఇది నాకు న్యాయంగా అనిపిస్తుంది” అని పేర్కొన్నారు. కాగా.. భారత్ లో ఇలాంటిదేమీ లేకున్నా. మరొక దేశంలో మాత్రం అమల్లోకి వస్తోంది. మొత్తం యూరప్ లోనే బాగా డెవలప్డ్ దేశంగా భావించే ఫ్రాన్స్ లో జాతీయ అసెంబ్లీ (పార్లమెంటు)కి ఎన్నికలు ఆసక్తి రేపాయి. ప్రస్తుత అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ ముందస్తు ఎన్నికలకు వెళ్లడమే దీనికి కారణం. ఇప్పుడు అక్కడ లెఫ్ట్ వింగ్ కు చెందిన న్యూ పాపులర్ ఫ్రంట్ కూటమి ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధం అవుతోంది. దీంతో ఆ దేశంలో ఎలాంటి విధానాలు అమలవుతాయా? అనే చర్చ నెలకొంది. మరోవైపు పార్లమెంటును ఆకస్మికంగా రద్దు చేస్తూ మెక్రాన్ తీసుకున్న నిర్ణయం ఆయనకే తిప్పికొట్టినట్లయింది. 577 స్థానాలున్న శక్తిమంతమైన దిగువ సభపై పట్టు సాధించే ఆయన వ్యూహం బెడిసికొట్టింది. సోమవారం వెలువడ్డ ఫలితాల్లో ఏ కూటమికీ మెజారిటీ రాలేదు.

**వామపక్షం సారథ్యం :** ఫ్రాన్స్ లో వామపక్షానికి చెందిన న్యూ పాపులర్ ఫ్రంట్ కూటమి ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధపడుతోంది. స్వతహాగానే వామపక్షాలు అధికారంలో ఉంటే ప్రజా సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తాయి. ఇక ఫ్రాన్స్ లో న్యూ పాపులర్ ఫ్రంట్ కూటమి రానుండడంతో రూ.3.60 కోట్ల (4 లక్షల యూరోలు) కంటే ఎక్కువ వార్షిక ఆదాయం ఉన్నవారిపై 90 శాతం పన్ను విధిస్తామని కూటమి ఎన్నికల ముంగిట హామీ ఇచ్చింది. ఇదిప్పుడు అమలు చేస్తారా? అన్న ప్రశ్న వస్తోంది. మరోవైపు రిటైర్మెంట్ వయసును 60 ఏళ్లకు పరిమిత చేయడం.. ఇంధన ధరల నియంత్రణ, కనీస వేతనాల పెంపు తదితర అంశాలను కూడా తన హామీల్లో ప్రస్తావించింది. దీంతో భారత్ లో సంచలనం రేపిన సంపద పన్ను ఫ్రాన్స్ లో అమలు కానుందా? అనే అభిప్రాయం వినిపిస్తోంది.

## డెక్కన్ క్రానికల్ ఆఫీస్‌పై దాడి

సంబంధించిన వీడియోను సదరు మీడియా సంస్థ ఎక్స్ లో పోస్ట్ చేసింది. అవును.. “అలయన్స్ టేక్స్ యూ-టర్న్ ఆన్ వీ.ఎస్.పీ ప్రైవేటైజేషన్” అనే శీర్షికతో ఓ కథనం డెక్కన్ క్రానికల్ ఆంగ్ల దినపత్రికలో ప్రచురితమైంది. దీంతో... ఆగ్రహించిన తెలుగుదేశం పార్టీ అనుబంధ సంఘాల కార్యకర్తలు ఆ పత్రికాఫీసుపై దాడి చేశారు. ఈ సందర్భంగా డీసీ ఆఫీసులో ఫర్నిచర్ ధ్వంసం చేశారని తెలుస్తోంది. “వైజాగ్ స్టీల్ ప్లాంట్ పై కూటమి యూటర్న్” అనే శీర్షికతో కథనం రావడమే దీనికి కారణం అని అంటున్నారు. దీనిపై ఆగ్రహం చెందిన టీ.ఎన్.ఎస్.ఎఫ్., తెలుగు మహిళా శ్రేణులు పత్రికా కార్యాలయం ముందు నిరసన తెలిపారు. అనంతరం ఆఫీసు ముందున్న బోర్డును తగులబెట్టారు. ఈ నేపథ్యంలో ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలను “ఎక్స్” లో పోస్ట్ చేసింది డెక్కన్ క్రానికల్. ఈ సందర్భంగా... ఈ దాడిని ఖండిస్తూ, ఇలాంటి బెదిరింపులకు భయపడబోమని డీసీ విలేఖరులు తెలిపారు. అతిపెద్ద మ్యాన్ డేట్ హింసకు లైసెన్స్ కాదని అన్నారు!

## రేవంత్ బూచి రాజకీయం !

రేవంత్ ఎప్పుడు కూడా చంద్రబాబు పట్ల తన కృతజ్ఞతను కోల్పోలేదు. అనేక వేదికల మీద చంద్రబాబు పట్ల తన విధేయతను రేవంత్ చాటుకున్నాడు. అయితే కాంగ్రెస్ బీజేపీకి బద్ధశతృవు. మరి చంద్రబాబు బీజేపీ కూటమి ఎన్డీఏలో భాగస్వామి. కానీ తెలంగాణలో టీడీపీ, కాంగ్రెస్ కలిసి పనిచేస్తున్నాయి. గత ఎన్నికల్లో తెలంగాణలో రేవంత్ గెలవడానికి ముఖ్య కారణాల్లో ఒకటి టీడీపీ అస్సలు పోటీ చేయకపోవడం, రెండు టీడీపీ ఓట్లు పూర్తిగా కాంగ్రెస్ కు బదిలీ కావడం కారణం. టీడీపీ పోటీ చేస్తే కాంగ్రెస్ పార్టీ గెలుపు సాధ్యమయ్యేది కాదు అని స్వయంగా రేవంత్ కూడా ఒప్పుకున్నాడు. అయితే కాంగ్రెస్ పార్టీలో ఉన్న ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా కాంగ్రెస్ అధిష్టానం రేవంత్ ను ఎప్పుడైనా ముఖ్యమంత్రి పీఠం నుంచి దింపుతారన్న ఊహాగానాలు ఉన్నాయి. అందుకే బాబు ఆశీస్సులతో తెలంగాణలో తన పీఠాన్ని నిలుపుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని భావిస్తున్నారు. బీఆర్ఎస్ నుండి ఎమ్మెల్యేలను కాంగ్రెస్ లోకి లాక్కోవడం వెనక రేవంత్ వ్యూహం కాంగ్రెస్ పార్టీని బలపరచడం కన్నా తన బలం పెంచుకోవడమే లక్ష్యం అని అంటున్నారు. కాంగ్రెస్ పార్టీ నుండి గెలిచిన 65 మందిలో రేవంత్ కు అన్ని వేళలా మద్దతు పలికేవారు 25 నుండి 30 లోపే ఉంటుందని సమాచారం. అందుకే రేవంత్ బీఆర్ఎస్ నుండి చేరికల మీద దృష్టిపెట్టాడు. కొత్తగా చేరిన వారంతా రేవంత్ పట్ల విశ్వాసంగా ఉంటారు. ఒకవేళ కాంగ్రెస్ అధిష్టానం ఏదైనా కీలక నిర్ణయం తీసుకుంటే తన వర్గంతో పాటు కొత్తగా వచ్చిన వారు తన వైపు ఉంటారన్న ఆలోచనతో చేరికల కోసం రేవంత్ ఇంత తీవ్రంగా ఒత్తిడి పెంచుతున్నాడని తెలుస్తుంది. ఒకటి తన మద్దతుదారులను పెంచుకోవడం, రెండు బాబు అండతో పరోక్షంగా బీజేపీ మద్దతును పొందుతూ కాంగ్రెస్ అధిష్టానం తన విషయంలో ప్రత్యామ్నాయ ఆలోచన లేకుండా చేసుకోవడమే రేవంత్ లక్ష్యంగా కనిపిస్తుందని చెప్పవచ్చు.

## ఏపీ ఆర్థిక పరిస్థితి లోతుల్లోనే..!

ఆదాయం ఎంత అప్పు ఎంత అన్న దాని మీద మరింత స్పష్ట కోసం చూస్తున్నారు. అదే టైం లో కేంద్ర బడ్జెట్ లో ఏపీకి ఎంత మేరకు ఆర్థికంగా ఊతం లభిస్తుంది అన్నది కూడా చూస్తున్నారు. కేటాయింపులు కేంద్ర బడ్జెట్ లో చూసుకుని ఆ మీదట మిగిలిన సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ ని పూర్తిగా పెట్టాలని భావిస్తున్నట్లుగా తెలుస్తోంది. ఏది ఏమైనా ఏపీలో ఆర్థిక రంగం అన్నది లోతైన అధ్యయనం చేయాల్సిన విషయమే అని అంటున్నారు. కొత్త ప్రభుత్వానికి కనీసంగా ఒక ఏడాది రెండేళ్ల వరకూ ఇదే రకమైన ఒడిదుడుకులు తప్పకపోవచ్చు అని అంటున్నారు. అదే విధంగా కేంద్రం ఈ సమయంలో ఆదుకోవాల్సి ఉంటుందని అంటున్నారు. అంతే కాకుండా బడ్జెట్ లో కేటాయింపులు చేసిన దానిని పూర్తిస్థాయిలో విడుదల చేస్తేనే రాష్ట్రం కోలుకోలగలదని అంటున్నారు. మొత్తం మీద చూసుకుంటే ఏపీలో ఆర్థిక పరిస్థితి నిరాశాజనకంగా ఉంది అని అంటున్నారు. సంపద సృష్టి అన్నది ఒక రోజులో అయ్యేది కాదు అది క్రమంగా రావాలి. ఫలితాలు వచ్చేంతవరకూ కూడా వేచి చూడాలి. దాంతో కత్తి మీద సాముగానే ఆర్థిక రంగం ఉంటుందని అంటున్నారు.

## మూడో శ్వేత పత్రం!

రంగంలో జగన్ ప్రభుత్వం చేసిన ఆర్థిక విధ్వంసం, అప్పులు, నిధుల దారి మళ్లింపు, దుర్వినియోగం లెక్కలు తేల్చాలంటే ఇప్పుడున్న కాగ్ వల్ల కూడా కాదని, కొత్త కాగ్ రావాల్సిందేనని చంద్రబాబు తెలిపారు. గత ఐదేళ్లలో విద్యుత్ రంగం సర్వనాశనమైందన్నారు. కరెంటు బకాయిల సర్దుబాటు పేరుతో పంచాయతీల నుంచి నిధులు తీసేసుకున్నారని ఆరోపించారు. ఈ మొత్తంలో కొంత మాత్రమే విద్యుత్ సంస్థలకు ఇచ్చారని.. మిగతా మొత్తాన్ని దారి మళ్లించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు విద్యుత్ రంగంలో తానెన్నో సంస్కరణలు తెచ్చానన్నారు. వీటి వల్ల రాష్ట్రానికి మిగులు విద్యుత్ లభించిందన్నారు. కానీ తన ‘పవర్’ పోయిందని చమత్కరించారు. విద్యుత్ సంస్కరణలపై నాటి ప్రతిపక్షాలు ప్రజలను తప్పుదోవ పట్టించడం వల్లే అధికారాన్ని కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు వైసీపీ దుర్మార్గ పాలనలో విద్యుత్ రంగం కునారిల్లిందని.. దీన్ని సంస్కరించే బాధ్యత తీసుకుంటానని చంద్రబాబు తెలిపారు. మొత్తం విద్యుత్ రంగాన్ని గాడిన పెట్టేందుకు వ్యూహం రూపొందిస్తామని వెల్లడించారు. కోతలు, లోఓల్టేజీ సమస్యలు లేకుండా నాణ్యమైన విద్యుత్ ఇస్తామని హామీ ఇచ్చారు. దానిలో నిర్లక్ష్యం వహిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రూ అప్ చార్జీల పేరుతో జగన్ ప్రభుత్వం పేదలపై భారం మోపిందని చంద్రబాబు తీవ్ర విమర్శలు చేశారు. దీంతో పేదలపై ఆర్థిక భారం పడిందని.. పేదలకు నష్టం చేసి పెత్తందారులకు జగన్ లాభం చేశారని ఆరోపించారు. తన ప్రభుత్వం ముందు చాలా సవాళ్లు ఉన్నాయని చంద్రబాబు తెలిపారు. ఎన్డీయే భాగస్వాములుగా ఉన్నప్పటికీ మొత్తం వారి నెత్తినే రుద్దలేమని వ్యాఖ్యానించారు. వాళ్ల ఇబ్బందులు వాళ్లకుంటాయని.. 29 రాష్ట్రాల సమస్యలను వారు చూడాల్సి ఉంటుందని చెప్పారు. అందుకే మన కష్టంతో ముందుకెళుతూ వారిని కూడా సాయం చేయాలని కోరానన్నారు. గత జగన్ ప్రభుత్వం చేసుకున్న విద్యుత్ ఒప్పందాలన్నింటిని సమీక్షిస్తామని చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఒక భూతాన్ని తలుచుకుని పారిశ్రామికవేత్తలు భయపడుతున్నారని.. ఆ భూతాన్ని రాజకీయంగా తాను భూస్థాపితం చేస్తానని సంచలన వ్యాఖ్యలు చేశారు. రైతులకు ప్రభుత్వ ఖర్చుతో సోలార్ ప్యానళ్లు అందజేస్తే రైతులే విద్యుత్ ఉత్పత్తి చేస్తారని చంద్రబాబు చెప్పారు. మిగులు విద్యుత్ ను వారే ప్రభుత్వానికి అమ్ముకోవచ్చన్నారు. రైతులకు దీనివల్ల ఆదాయం వస్తుందన్నారు. రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్ లో గ్రీన్ హైడ్రోజన్ విద్యుదుత్పత్తికి అపార అవకాశాలున్నాయని చంద్రబాబు తెలిపారు. ఏపీ గ్రీన్ హైడ్రోజన్ విద్యుదుత్పత్తికి హబ్ గా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మరోవైపు చంద్రబాబు విడుదల చేసిన శ్వేతపత్రంపై వైసీపీ నేతలు విమర్శలు చేస్తున్నారు. గతంలో చంద్రబాబు చేసిన తప్పుల వల్లే విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కంలు) అప్పుల్లో కూరుకుపోయాయని ఆరోపిస్తున్నారు. జగన్ అధికారంలోకి వచ్చాకే చంద్రబాబు వదిలేసిన బకాయిలను చెల్లించి డిస్కంలను ఆదుకున్నారని గుర్తు చేస్తున్నారు.

## జనసేనకే కీలక పదవి

న్యాయవాదులు పోటీపడ్డారు. మానవ వనరులు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ను ప్రసన్నం చేసుకుని.. ఈ పోస్టును పొందడానికి ప్రయత్నించారు. ఆయన పేరు కూడా దాదాపు ఖరారైంది. అయితే జనసేనాని, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఏఏజీ పదవిని తమకు కేటాయించాల్సిందేనని గట్టిగా కోరారని తెలుస్తోంది. పొత్తు ధర్మాన్ని పాటించాలని సూచించడంతో చంద్రబాబు జనసేన లీగల్ సెల్ చైర్మన్ ను ఈ పదవికి ఎంపిక చేశారు. కాగా అదనపు అడ్వొకేట్ జనరల్ గా నియమితులైన సాంబశివ ప్రతాప్.. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు మండలం తిల్లపూడికి చెందినవారు. ఆయనకు ఉమ్మడి హైకోర్టు, విభజిత ఏపీ హైకోర్టులో న్యాయవాదిగా అపార అనుభవం ఉంది. 2014లో జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీకి సాంబశివ ప్రతాప్ న్యాయ సేవలు అందిస్తున్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల తర్వాత జనసేన పార్టీ లీగల్ సెల్ ఛైర్మన్‌గా కొనసాగుతున్నారు. ఆయనకు వివాదరహితుడిగా, సౌమ్యుడిగా పేరుంది. 1984లో సాంబశివ ప్రతాప్ న్యాయవాదిగా ఎన్ రోల్ అయ్యారు. 1996 నుంచి 2002 మధ్యలో మున్సిపల్ స్టాండింగ్ కౌన్సెల్ గా ఆంధ్రా ప్రాంతపు మున్సిపాలిటీల తరఫున సాంబశివ ప్రతాప్ పనిచేశారు. 2016-19 మధ్య ఉమ్మడి హైకోర్టులో ప్రభుత్వ న్యాయవాదిగా తన వాదనలు వినిపించారు. అలాగే పలు బ్యాంకులు, బీమా కంపెనీలు, ప్రభుత్వరంగ సంస్థలకు స్టాండింగ్ కౌన్సెల్ గానూ చేశారు. తన నియామకంపై సాంబశివ ప్రతాప్.. జనసేనాని పవన్ కళ్యాణ్ కు, సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు.

## విజయవాడ తమ్ముళ్లు


వస్తే.. ఇక్కడ తమ్ముళ్లు వ్యవహరించిన తీరు తీవ్ర విమర్శలకు దారి తీసింది. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో టీడీపికి బలం ఉండి కూడా.. చేదు అనుభవం ఎదురైంది. స్టాండింగ్ కమిటీలకు సంబంధించి మొత్తంగా ఆరు స్థానాలు ఉన్నాయి. వాస్తవానికి టీడీపీకి 13 మంది కార్పొరేటర్లు ఉన్నారు. అంటే.. మొత్తంగా కాకపోయినా.. ఒకటి రెండు స్థానాలనైనా వీరు దక్కించుకోవాల్సి ఉంది. కానీ, అలా జరగలేదు. మొత్తం ఆరుకు ఆరు స్టాండింగ్ పదవులను కూడా వైసీపీనే దక్కించుకుంది. అది కూడా భారీ మెజారిటీ తో!!? ఆశ్చర్యంగా ఉన్నా నిజం. దీంతో అధికారంలో ఉండి కూడా విజయవాడ రాజకీయాలపై టీడీపీ పట్టు పెంచుకోలేదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదేసమయంలో తమ్ముళ్ల వ్యవహారంపైనా పార్టీలో చర్చ సాగుతోంది. తెల్లారి లేస్తే.. మీడియా ముందు గళం విప్పే బుద్దా వెంకన్న ఇంటికి కూత వేటు దూరంలో ఉన్న కార్పొరేషన్ కార్యాలయంలో పార్టీ ఇలా డీలా పడిపోతే..ఆ యన ఏం చేస్తున్నారనే ప్రశ్నలు కూడా వస్తున్నాయి. దీనిపై పార్టీ అధినేత, సీఎం చంద్రబాబు ఎలా రియాక్ట్ అవుతారో చూడాలి.

## ముస్లిం మహిళలు భరణం!

విషయం దేశవ్యాప్తంగా సంచలన విషయంగా మారిందని అంటున్నారు. అవును... విడాకులు తీసుకున్న తర్వాత ముస్లిం మహిళలు కూడా భరణం తీసుకోవచ్చని, అందుకు వారు కూడా అర్హులేనని తాజాగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. 125 సీఆర్పీసీ ప్రకారం విడాకులు తీసుకున్న తన భార్యకు భరణం చెల్లించాలంటూ ఇచ్చిన ఆదేశాలను సవాలు చేస్తూ ఓ ముస్లిం వ్యక్తి సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. అయితే జస్టిస్ బీవీ నాగరత్నం, జస్టిస్ అగస్టీన్, జస్టిస్ జార్జ్ మాసిష్ లతో కూడిన ధర్మాసనం కొట్టివేసింది. విడాకుల తర్వాత తమ మాజీ భార్త నుంచి ముస్లిం మహిళలు భరణం కోరవచ్చని సంచలన తీర్పునిచ్చింది. ఇదే సమయంలో... ఈ హక్కును కల్పించే ఆ సెక్షన్ ను విడాకులు తీసుకున్న ముస్లిం మహిళలకు వర్తింపజేస్తున్నట్లు తెలిపింది. ఈ సందర్భంగా స్పందించిన ధర్మాసనం... ముస్లిం మహిళల (విడాకుల హక్కుల పరిరక్షణ) చట్టం 1986 సెక్యులర్ చట్టాన్ని అధిగమించలేదని పేర్కొంది. ఇదే సమయంలో సెక్షన్ 125 మహిళలందరికీ వర్తిస్తుందని తెలిపింది. మతంతో సంబంధం లేకుండా ఈ సెక్షన్ కింద వివాహితలు భరణం కోరవచ్చని స్పష్టం చేసింది. ఇదే సమయంలో భరణం ఇవ్వడం అనేది ఎట్టిపరిస్థితుల్లోనూ ధాతృత్వం కాదని.. భార్య తమపై మానసికంగా, ఇతర రకాలుగా ఆధారపడి ఉంటుందనే వాస్తవాన్ని కొంతమంది భర్తలు గుర్తించడం లేదని పేర్కొంది. గృహిణి పాత్రను, ఆమె త్యాగాన్ని గుర్తించాల్సిన సమయం వచ్చిందని స్పందించింది.

## ఉద్యోగాల ఎర !

### యూఎస్‌లో తెలుగువాళ్లు అరెస్ట్



CHANDAN DASIREDDY DWARAKA GUNDA SANTHOSH KATKOORI ANIL MALE

అమెరికాలో నలుగురు తెలుగువాళ్లు అరెస్ట్ అయ్యారు. టెక్సాస్ పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. మనుషుల అక్రమ రవాణా కేసులో వాళ్లు ప్రధాన నిందితులు. వారిలో ఇద్దరు భార్యభర్తలు కూడా కావడం కలకలం రేపుతోంది. ఆ దేశ చట్టాల ప్రకారం వారిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. ఆ నలుగురూ- చందన్ దశిరెడ్డి, సంతోష్ కట్కూరి, ద్వారకా గుండా, అనిల్ మలె. వారిలో సంతోష్ కట్కూరి, ద్వారకా గుండా భార్యభర్తలు. టెక్సాస్‌లోని ప్రిన్స్‌టన్ కొలిన్ కంట్రీలో వాళ్లు నివసిస్తోన్నారు. మనుషుల అక్రమ రవాణాకు పాల్పడటం, నిర్బంధించి తమ కంపెనీల్లో వెట్టిచాకిరి చేయిస్తోన్నారంటూ ఫిర్యాదులు అందడంతో ప్రిన్స్‌టన్ పోలీసులు అరెస్ట్ చేశారు. కొలిన్ కంట్రీ గిన్స్‌బర్గ్ లేన్‌లోని ఓ ఇంట్లో 15 మంది మహిళలు ఒకే గదిలో నివసిస్తోన్నారని, వారి అత్యంత దయనీయంగా ఉందంటూ పెస్ట్ కంట్రోల్ డిపార్ట్‌మెంట్ నుంచి పక్కా సమాచారం అందడంతో ప్రిన్స్‌టన్ పోలీసులు దాడులు చేశారు. ఆ 15 మందికి విముక్తి కల్పించారు. కంప్యూటర్, కొన్ని ఎలక్ట్రానిక్స్ వస్తువులు, బ్లాంకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఒక్క ఫర్నిచర్ కూడా ఆ ఇంట్లో లేకపోవడం, ఆ ఇళ్లు కూడా అంతమంది నివసించడానికి అనుకూలంగా లేకపోవడం.. హ్యూమన్ ట్రాఫికింగ్‌కు నిదర్శనంగా గుర్తించారు. వారిని చందన్ దశిరెడ్డి, సంతోష్ కట్కూరి, ద్వారకా గుండా, అనిల్ మలె బలవంతంగా నిర్బంధించినట్లు నిర్ధారించారు. వారిని అరెస్ట్ చేశారు. కొన్ని కంపెనీల్లో ఉద్యోగాలను ఇప్పిస్తామని ఆశపెట్టి వారిని అమెరికాకు తీసుకొచ్చినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. అవన్నీ కూడా డొల్ల కంపెనీలేనని వెల్లడించారు. ప్రిన్స్‌టన్‌తో పాటు మెలిస్సా, మెక్‌కెన్నీ ప్రాంతాల్లోనూ ఈ దాడులు కొనసాగాయి. ఈ సందర్భంగా కొన్ని కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు.

## క్రీడలు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయి



**పులివెందుల, విశ్వంవాయిస్ న్యూస్ :** రాష్ట్రంలోని క్రీడాకారులకు మెరుగైన శిక్షణ ఇస్తామని, క్రీడా శాఖలో ఉన్న దొంగ సర్టిఫికెట్లను రూపుమాపుతామని రాష్ట్ర క్రీడా శాఖ, రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. బుధవారం పులివెందుల పట్టణంలోని వైఎస్ఆర్ హాకీ క్రీడా మైదానంలో సౌత్ జోన్-2 హాకీ క్రీడా పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనకు క్రీడా సంఘ సభ్యులు, క్రీడాకారులు ఘన స్వాగతం పలికారు. క్రీడాజ్యోతి వెలిగించి, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం హాకీ స్టిక్‌తో బాలును కొట్టి క్రీడలను ప్రారంభించారు. పోటీల్లో కేరళ, తమిళనాడు, తెలంగాణా, ఎపి, పుదుచ్చేరి, కర్నాటక నుంచి క్రీడా కారులు పాల్గొన్నారు. క్రీడలు ఈనెల 17 వరకు నిర్వహిస్తారు. చివరి రోజు విజేతలకు మెడల్స్, కప్పు, మెమోంటోలతోపాటు సర్టిఫికెట్లు ప్రదా నం చేస్తారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడారు. విద్యతోపాటు క్రీడలపై కూడా దృష్టి పెట్టాలని, ప్రతి ఉద్యోగంలో స్పోర్ట్స్ కోటా కూడా ఉంటుందని చెప్పారు. సర్టిఫికెట్లతో ఎంతోమంది ఉద్యో గాలు కూడా పొందారని అన్నారు. ముఖ్యంగా గత ప్రభుత్వంలో క్రీడా శాఖ మంత్రి ఎవరో కూడా తెలియని పరిస్థితి మనకు ఉండేదని పేర్కొన్నారు. ఐదేళ్ల వైసిపి పాలనలో సుమారు రూ.130 కోట్లు క్రీడల కోసం దుర్వినియోగం చేశారని తెలిపారు. ప్రస్తుతం ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వంలో క్రీడల కోసం ఖర్చు చేసే ప్రతి రూపాయి పేద క్రీడాకారునికి ఉపయోగిస్తామని ఒక్క రూపాయిని కూడా దుర్వినియోగం చేయమని చెప్పారు. 22 మంది కోచ్‌లకు సుమారు ఏడు నెలలు వేతనాలు ఇవ్వకుండా గత ప్రభుత్వం వారిని ఇబ్బంది పెట్టిందని పేర్కొన్నారు. తాము వచ్చిన 35 రోజుల లోపల వారికి జీతాలు అందించామని తెలిపారు. ప్రస్తుతం క్రీడలపై యువత ఎంతో ఉత్సాహంగా ముందుకు వస్తున్నారని, వారికి మెరుగైన శిక్షణ ఇచ్చే విధంగా అన్ని చర్యలు చేపడతామని అన్నారు. ఇటీవల తార ఒలింపిక్స్‌లో కూడా ఆంధ్రప్రదేశ్ సంబంధించి ఎంతోమంది ఎక్కడికి వెళ్లి పాల్గొన్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఎటువంటి తప్పులు జరగకుండా క్రీడాకారులకు మంచి నైపుణ్యాన్ని అందించడం లక్ష్యంగా ముం దుకు వెళ్తామని ఉద్ఘాటించారు.

## ట్రిపుల్ ఆర్ ఇన్ వైసీపీ !

ఉన్న వైవీ సుబ్బారెడ్డి, మిథున్ రెడ్డి, విజయసాయిరెడ్డి. వీరినే ట్రిపుల్ ఆర్ అంటే రెడ్ల త్రయం అని సెటైరికల్ గా ప్రత్యర్థులు అంటున్నారుట. ఇక చూస్తే వైసీపీకి లోక్ సభలో నలుగురు, రాజ్యసభలో పదకొండు మంది ఎంపీలు ఉన్నారు. మొత్తంగా 15 మంది ఎంపీలు అన్న మాట. ఈ పదిహేను మందికి కలిపి పార్లమెంటరీ పార్టీ నేత అని ఒక పోస్ట్ ఉంది. దానికి ఈ ట్రిపుల్ ఆర్ అదే రెడ్ల త్రయంలో ఒకరైన వైవీ సుబ్బారెడ్డికి ఈ పోస్టు ఇచ్చారు. అదే విధంగా లోక్ సభలో వైసీపీ పక్ష నేతగా మిథున్ రెడ్డికే జగన్ బాధ్యతలు అప్పగించారు. రాజ్యసభలో విజయసాయిరెడ్డి వైసీపీ పక్ష నేతగా వ్యవహరిస్తున్నారు. అంటే ఈ మూడు కీలక పోస్టులలో ట్రిపుల్ ఆర్ లనే జగన్ సెట్ చేశారు అన్న మాట. దాని మీదనే ఇపుడు అంతా విమర్శలు చేస్తున్నారుట. నా ఎస్సీలు నా బీసీలు నా ఎస్టీలు అని చెప్పే జగన్ ఈ కీలకమైన పదవులు ఎందుకు ఈ సామాజిక వర్గాల వారికి ఇవ్వలేదు అన్న చర్చ అయితే నడుస్తోంది. రెండు సార్లు ఎంపీగా గెలిచిన తిరుపతి లోక్ సభ సభ్యుడు గురుమూర్తి రెడ్డికి లోక్ సభలో వైసీపీ పక్ష నేతగా అవకాశం ఇస్తే ఎంత బాగుండేది అన్న చర్చ ఉంది. అలాగే రాజ్యసభలో బీసీ ఎంపీలు వైసీపీకి పెద్ద ఎత్తున ఉన్నారు. వారిలో ఒకరికి సభా పక్ష నేత హోదా ఇస్తే బాగుంటుంది కదా అని అంటున్నారు. అలాగే పార్లమెంటరీ పార్టీ నేతగా బీసీల నుంచి ఎంపిక చేస్తే వైసీపీకి కూడా రాజకీయంగా ప్రయోజనకరంగా ఉండేది అన్న సూచనలు వస్తున్నాయి. అయితే జగన్ చెప్పేది ఒకటి చేసేది ఒకటి అన్న విమర్శలు అయితే ఉన్నాయి. ఆయన నినాదాలు బీసీలు ఎస్సీలు అని ఇచ్చినా ఆచరణలో మాత్రం తన బిజినెస్ పార్టనర్లనే ముందు పెట్టి పదవులు వారికే కట్టబెడుతున్నారు అన్న విమర్శలు అయితే వస్తున్నాయి. రాజకీయ పార్టీ ఏదైనా అన్ని కులాలను సమానంగా చూడాలి. అఫ్ కోర్స్ చూసినట్లుగా అయినా కనిపించాలి. కానీ అలాంటిది ఏదీ లేకుండా ఎవరు ఏమనుకున్నా ఏమిటి అన్నట్లుగా ఒకే సామాజిక వర్గానికి పదవులు అన్నీ కట్టబెడితే విమర్శల దాడి తప్పదనే అంటున్నారు. దాంతోనే వైసీపీలో ట్రిపుల్ ఆర్ అని ప్రత్యర్థులు సెటైర్లు వేసేందుకు ఆస్కారం కలిగింది అని అంటున్నారు.

## బీజేపీలోకి బుగ్గన !

నేత, మాజీమంత్రి బుగ్గన రాజేంద్ర నాథ్ వైసీపీకి రాజీనామా చేయబోతున్నారని, బీజేపీలోకి చేరాలనుకుంటున్నారని, దీనికోసం ఆయన విశ్వప్రయత్నాలు చేస్తున్నారని ఓ కథనం హల్ చల్ చేసింది. ఈ నేపథ్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆన్ లైన్ వేదికగా ఘాటుగా స్పందించింది. ఇందులో భాగంగా... మాజీమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి పార్టీ మారుతున్నారంటూ అచ్చైంది నిరాధార కథనం అని.. ఆయన పార్టీ మారడం లేదని.. ఆ కథనం పూర్తిగా అవాస్తవం అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తన అధికారిక “ఎక్స్” లో రియాక్ట్ అయ్యింది.

## విశాఖ దశ తిరుగుతుందా?

సందర్శించి అక్కడ అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. విశాఖ ఉక్కు ని ప్రైవేట్ పరం కాకుండా రక్షించాలంటూ గత మూడేళ్ళుగా కార్మికులు అలుపెరగని తీరున ఆందోళనలు చేస్తున్నారు. దాంతో ఉక్కుని పరిరక్షిస్తే విశాఖ సహా ఉత్తరాంధ్ర కు మేలు జరుగుతుందని భావిస్తున్నారు. మరో వైపు చూస్తే ముఖ్యమంత్రి చంద్రబాబు సీఎం గా నాలుగవ సారి ప్రమాణం చేశాక విశాఖ వస్తున్నారు. ఆయన విశాఖలో ఎడ తెగని కార్యక్రమాలతో పూర్తి బిజీగా పర్యటించనున్నారు. ఈ నెల 11న సీఎం చంద్రబాబు అనకాపల్లి, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల పర్యటనలు వరసగా చేయనున్నారు. చంద్రబాబు అనకాపల్లి జిల్లాలోని దార్లపూడి చేరుకుని పోలవరం ఎడమ కాలువను ముఖ్యమంత్రి పరిశీలిస్తారు. అలాగే విజయనగరం జిల్లాలోని భోగాపురం ఎయిర్ పోర్టును సందర్శిస్తారు. అక్కడ పనులు జరుగుతున్న తీరుపై ఉన్నత అధికారులతో సమీక్షిస్తారు. చంద్రబాబు అక్కడ నుంచి మెడ్ టెక్ లో జరిగే సీఐఐ సదస్సులో అలాగే విశాఖ ఎయిర్ పోర్టులో ముఖ్యమంత్రి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. విశాఖలో గత ఐదేళ్లలో నిలిచిపోయిన పలు ప్రాజెక్టుల స్థితిగతులపై సమీక్ష నిర్వహిస్తారు. ఇలా ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక వైపు ఉక్కు మంత్రి కుమార స్వామి మరోవైపు రానుండడంతో విశాఖ సమస్యలు పరిష్కారం అవుతాయా అన్న ఆశ అందరిలో కనిపిస్తోంది. చంద్రబాబు విశాఖ నగర అభివృద్ధి జిల్లా ప్రగతి మీద చేసే చర్చ గురించి కూడా అంతా ఆసక్తిగా గమనిస్తున్నారు. విశాఖ సహా ఉత్తరాంధ్ర కూటమికి ఎంతో ఇచ్చింది. మరి కూటమి పాలకులు ఈ ప్రాంతానికి ఏ వరాలు మోసుకొస్తున్నారు అన్నదే అంతా చర్చించుకుంటున్న విషయం.

## ఎడిటర్ వాయిస్

# మంచి పరిణామం

నాలుగు రోజుల వ్యవధిలో వెలువడిన రెండు కీలకమైన ఎన్నికల ఫలితాలు నయా ఉదారవాద, నియో ఫాసిస్టుశక్తులను ఓడించడం సాధ్యమేనని నిరూపించాయి. ఫ్రాన్స్‌లో ఎదురు లేదనుకున్న మెరీన్ లీపెన్ నేతృత్వంలోని ఫాసిస్టు నేషనల్ ర్యాలీ పార్టీ, దాని మిత్రులను ఓడించి అతిపెద్ద కూటమిగా లెఫ్ట్ పార్టీ సంచలన విజయం సాధించడం, బ్రిటన్‌లో టోరీల పద్నాలుగేళ్ల ముదనష్టపు పాలనకు అక్కడి ప్రజలు చరమగీతం పాడడం ఆహ్వానించదగ్గ పరిణామం. ఈ రెండు తీర్పులు ప్రపంచవ్యాప్తంగా జాత్యహంకార, నయా ఉదారవాద విధానాలపై పోరాడుతున్న శక్తులకు ప్రేరణనిచ్చేవే. ఫ్రాన్స్‌లో వామపక్ష, ప్రగతిశీల శక్తులతో కూడిన న్యూ పాపులర్ ఫ్రంట్ సాధించిన విజయం ఎంతైనా కొనియాడదగినది. రెండున్నర శతాబ్దాల క్రితమే 'స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం' నినాదాన్ని ప్రపంచానికి అందించిన ఫ్రెంచి విప్లవ వారసత్వాన్ని నాటి హిట్లర్ ఫాసిజాన్ని తిప్పికొట్టిన నాటి పాపులర్ ఫ్రంట్ తరహాలో ఏర్పాటైన న్యూ పాపులర్ ఫ్రంట్ మూడు వారాల్లోనే సంచలనం సృష్టించింది. మొదటి రౌండ్‌లో మూడింట రెండొంతుల ఓట్లతో మొదటి స్థానంలో ఉన్న లీపెన్ పార్టీ (నేషనల్ ర్యాలీ) నేతృత్వంలోని ఫాసిస్టు కూటమిని రెండో రౌండ్ తరువాత మూడవ స్థానంలోకి నెట్టేసి, అగ్రస్థానాన్ని చేజిక్కించుకోవడం చిన్న విషయమేమీ కాదు. నెల రోజుల క్రితం జరిగిన యూరోపియన్ పార్లమెంట్ ఎన్నికల్లో నేషనల్ ర్యాలీ పార్టీ 31.5 శాతం ఓట్లతో అతి పెద్ద ప్రాంతీయ శక్తిగా అవతరించడంతో ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ జాతీయ అసెంబ్లీని రద్దు చేసి, మధ్యంతర ఎన్నికలను ప్రకటించారు. జూన్ 30న 'సింగిల్ కానిస్టిట్యుయెన్సీ డైరెక్ట్ ఎలక్షన్' పద్ధతిలో జరిగిన మొదటి రౌండ్ ఎన్నికల్లో 76 మంది అభ్యర్థులు గెలవగా, జులై 7న రెండో రౌండ్‌లో 501 స్థానాలకు పోలింగ్ జరిగింది. 577 స్థానాలున్న ఫ్రాన్స్ పార్లమెంటులో సాధారణ మెజార్టీకి అవసరమైన 289 స్థానాలు ఏ కూటమికీ లభించకపోవడంతో హంగ్ ఏర్పడింది. ఫ్రెంచ్ రాజ్యాంగం ప్రకారం ఏకైక అతిపెద్ద కూటమిగా ఉన్న న్యూ పాపులర్ ఫ్రంట్‌నే ప్రభుత్వ ఏర్పాటుకు అధ్యక్షుడు మొదట ఆహ్వానించాలి. సోషలిస్టులు, కమ్యూనిస్టులు, గ్రీన్‌పార్టీ, ఫ్రాన్స్ అన్‌బౌండ్ పార్టీలతో కూడిన న్యూపాపులర్ ఫ్రంట్ దేశానికి ఫాసిస్టుల నుంచి ఎదురవుతున్న ముప్పును గుర్తించి సరైన సమయంలో సరైన వ్యూహం, రాజకీయ ఎత్తుగడలతో లీపెన్ పార్టీని అధికారానికి ఆమడ దూరంలో ఉంచింది. అలా అని లీపెన్ పార్టీ ప్రమాదం తొలగిపోలేదు. పార్టీల వారీగా చూస్తే ఓట్లలోను సీట్లలోనూ అతిపెద్ద పార్టీగా నేషనల్ ర్యాలీ ఉన్నది. మొదటి రౌండ్‌లో ఫలితాలను చూశాక ఫాసిస్టు పార్టీని ఎట్టి పరిస్థితుల్లోనూ అధికారంలోకి రానీయకుండా చూడాలన్న దృఢ సంకల్పంతో న్యూ పాపులర్ ఫ్రంట్ రాజకీయ ఎత్తుగడల్లో మార్పు చేసింది. ఫాసిస్టు వ్యతిరేక ఓట్లలో చీలికను నివారించాలన్న ఉద్దేశంతో తాను గెలిచే అవకాశాలు తక్కువగా ఉన్న 200 నియోజకవర్గాల్లో అభ్యర్థులను ఉపసంహరించుకుంది. ఇది మాక్రాన్ నేతృత్వంలోని రినైజాన్స్ కూటమికి కొంత లాభించినా, ఫాసిస్టు శక్తులను ఒంటరిపాటు చేయడానికి ఇది దోహదపడింది. ఈ వాస్తవాన్ని మాక్రాన్ పార్టీ గుర్తెరిగి వ్యవహరించాలి. అది అనుసరించిన నయా ఉదారవాద విధానాలే పచ్చి మితవాద శక్తులకు ఇంతగా ఊతమిచ్చాయి. 2019లో వచ్చిన ఎల్లో వెస్ట్ ఉద్యమం, రిటైర్మెంట్ వయసును 64 ఏళ్లకు పెంచడం, పెన్షన్లలో కోత, విపరీతంగా పెరిగిన ద్రవ్యోల్బణం, జీవన వ్యయం భారం కావడం, నిరుద్యోగం, చివరికి నిరుద్యోగ భృతిని తిరస్కరిస్తూ ఆదేశాలివ్వడం.వంటి చర్యలు మాక్రాన్ పార్టీ పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకతను, అసంతృప్తిని రేకెత్తించాయి. తొలి రౌండ్ ఫలితాలతో నిరుద్యోగ భృతి తిరస్కరణ ఆదేశాలను పక్కనపెట్టడం లాంటి చర్యలు తీసుకోవడం మాక్రాన్ పార్టీ రెండో స్థానంలోకి రావడానికైనా దోహదపడింది. వామపక్షాల నేతృత్వంలో సంకీర్ణం ఏర్పడాలన్న ఫ్రాన్స్ ప్రజల అభిమతాన్ని నెరవేర్చాల్సిన బాధ్యతను నెరవేర్చాల్సి ఉంది. బ్రిటన్ పార్లమెంట్ ఎన్నికల్లో లేబర్ పార్టీకి మూడింట రెండొంతుల మెజారిటీతో చేకూరిన విజయం ఆ పార్టీ గొప్పతనం అనే దాని కన్నా టోరీలపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతే ఈ తీర్పులో ఎక్కువగా ప్రతిబింబించింది. కీర్ స్టార్మర్ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించారు. 14 ఏళ్ల పాలనలో దూకుడుగా అనుసరించిన నయా ఉదారవాద విధానాలతో కన్జర్వేటివ్ పార్టీ (టోరీ) చరిత్రలోనే అతిఘోర ఓటమిని మూటగట్టుకుంది. 650 స్థానాలున్న సభలో 412 స్థానాలను సాధించినా, లేబర్ పార్టీకి వచ్చిన ఓట్లు 33.8 శాతమే. ఐదేళ్ల క్రితం కంటే పెరిగినవి రెండు శాతమే. లేబర్ పార్టీలో వామపక్ష భావాలున్న నేత జెరెమీ కార్బిన్ నాయకత్వంలో 2017లో సాధించిన 40 శాతం ఓట్లకు కూడా చేరువ కాలేదన్నది చేదు వాస్తవం. ఇజ్రాయిల్‌పై మెతక వైఖరిని వ్యతిరేకిస్తూ కార్బిన్‌తోపాటు లేబర్ పార్టీ నుంచి విడిపోయి స్వతంత్రంగా పోటీ చేసిన ఐదుగురు అభ్యుదయవాదులు, సామ్రాజ్యవాద వ్యతిరేకులు గెలుపొందడం సానుకూల అంశం. పచ్చి మితవాది, అల్ట్రా రైట్ వింగ్ నాయకుడు నిగెల్ ఫరాజ్ నేతృత్వంలోని యుకె రిఫార్మ్ పార్టీ నాలుగు స్థానాలే గెలుచుకున్నా, గత ఎన్నికల్లో 1.7 శాతంగా ఉన్న ఓట్లను ఈ ఎన్నికల్లో 14 శాతానికి పెంచుకోవడం ఆందోళనకరం. బ్రెగ్జిట్, ఆరోగ్యం, విద్యా రంగాల్లో తీవ్ర వైఫల్యం, పార్టీగేట్, పోస్టాఫీస్ తదితర వరుస కుంభకోణాలతో రెండేళ్ల క్రితం నెలల వ్యవధిలోనే బ్రిటన్ ప్రధాని పీఠం నుంచి బోరిస్ జాన్సన్, లిజ్ ట్రస్ వైదొలగాల్సి వచ్చింది. ఆ తరువాత 20 నెలలపాటు ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన భారత సంతతికి చెందిన రిషి సునాక్ నేతృత్వంలోని కన్జర్వేటివ్ పార్టీ 121 స్థానాలకే పరిమితమైంది.



ఎడిటర్ : కె. సునీల్‌కుమార్

# నూతన నేర చట్టాలు నిలిపివేయాలి

**లోక్‌సభ చిట్టచివరి సమావేశాలలో అత్యంత నిర్లక్ష్యంగా అప్రజాస్వామిక పద్ధతిలో ఆమోదించిన మూడు నూతన చట్టాలు జులై 1 నుంచి దేశమంతటా అమలులోకి వచ్చేలా బిజెపి గట్టి చర్యలు తీసుకున్నది. ఇండియన్ పీనల్ కోడ్ (ఐపిసి), క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సిఆర్‌పిసి), ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ అనే మూడు గత చట్టాల స్థానాన్ని భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్షా సంహిత, భారతీయ సాక్ష్య అధినయం అనే ఈ మూడు చట్టాలు ఆక్రమించాయి. ఎలాంటి సన్నాహాలు, చర్చ, వాదనలు లేకుండానే మొత్తం న్యాయ వ్యవస్థ ప్రధాన మార్పులకు లోనుకావడం చూస్తే బుర్ర తిరిగే వ్యవహారం తప్ప మరొకటి కాదు.**




బిజెపి పని తీరు పైన విధానాల పైన ఓటర్లు తీర్పు ఇచ్చిన తర్వాత, పార్లమెంటులో మెజార్టీ రాకుండా పోయిన తర్వాత కూడా ఆ పార్టీలో ఏ మార్పు లేదని దీన్నిబట్టి స్పష్టమవుతుంది. హిందీలో మాత్రమే నామకరణం చేయబడిన ఈ మూడు చట్టాలపై లోక్‌సభలో లోతైన చర్చ జరిగిందే లేదు. ఏదో మొక్కబడి కోసం వాటిని సెలెక్ట్ కమిటీకి పంపి సభ ముందు పెట్టి క్షణాల మీద ఆమోదించేశారు. అసలు ఆ సమయంలో సభలో ప్రతిపక్ష సభ్యులు వుండే అవకాశమే లేకుండా చేయబడింది. ఎందుకంటే వారిలో 148 మందిని సస్పెండ్ చేసినందున సభలో పాల్గొనే అవకాశం లేదు. న్యాయవ్యవస్థ అన్ని స్థాయిల్లోనూ వుండే న్యాయవాద బృందాలు, సభ్యులు, ఆఖరుకు పోలీసులు కూడా ఈ కొత్త చట్టాలను గురించి పెద్దగా తెలియలేదు. అందువల్ల వాటి అమలు సహజంగానే వాటికి ఏ విధమైన వ్యాఖ్యానమివ్వాలి, అమలు చేయాలి అనే తీవ్రమైన సమస్యలు తెచ్చిపెడుతుంది. ఈ చట్టాలను అమలులోకి తేవడంతో పాటు దానికి సమాంతరంగా మరో నేర న్యాయవ్యవస్థ కూడా ఉనికిలోకి వస్తుంది. ఏమంటే జులై ఒకటవ తేదీకి ముందు ఏదైనా నేరం చేసిన ఒక వ్యక్తికి అప్పుడున్న విస్తారమైన నేర చట్టాల ప్రకారమే విచారించవలసి వుంటుంది. అదే నేరం గనక జులై 1 తర్వాత జరిగినట్టయితే ఈ సరికొత్త విస్తారమైన చట్టాల మేరకు విచారించవలసి వస్తుంది. అంటే దీని అర్థం ఏమంటే ఒక సమాంతర న్యాయవ్యవస్థ ఏర్పరచడం, ఒకే సమయంలో రెండు రకాల చట్టాలు అమలులోకి రావడం జరుగుతుందన్నమాట. దాంతో ఏ చట్టాన్ని వర్తింపచేయాలనే వివాదం రావడం సహజంగా జరుగుతుంది. ఉదాహరణకు జులై ఒకటవ తేదీ ముందు ఎఫ్ఐఆర్‌లో నేరారోపణకు గురైన వారు తమను పాత చట్టాల ప్రకారం విచారించాలిన కోరవచ్చు. కానీ ప్రాసిక్యూషన్ వారిని కొత్త చట్టాల ప్రకారం విచారణకు పెట్టడానికి ప్రయత్నించవచ్చు.వాజ్యాలు కూడా చాలా సంక్లిష్టంగా మారిపోతాయి.

**మరో యాభై ఏళ్లు అస్పష్టత:** చట్టాలకు సుప్రీం కోర్టు భాష్యం చెబుతూ వచ్చింది. సిఆర్‌పిసికి 1973లో చేసిన సవరణలు ఇప్పుడే కొంత నిశ్చిత రూపం సంతరించుకున్నాయి. ఈ కొత్త చట్టాలకు ఆ విధమైన స్థిరత్వం రావాలంటే మరో యాభై ఏళ్లు పడుతుంది. దేశంలోని వేలాది మంది మేజిస్ట్రేట్లు ఈ కొత్త చట్టాలకు వేర్వేరు పద్ధతుల్లో తమవైన వ్యాఖ్యానాలు చేసినప్పుడు ఏది నిలబడుతుందో ఊహించుకోవచ్చు. ఈ రకరకాల వ్యాఖ్యానాలు, ఆలస్యాల వల్ల నిందితులు విపరీతమైన సమస్యలకు గురవడం తథ్యం. ఆ నిందితులు గనక కస్టడీలో వుండేట్టయితే అతడు లేక ఆమె సమస్యలు మరింత జటిలంగా పరిణమిస్తాయి. చట్టం నిర్దేశించే పద్ధతి వల్ల తప్ప మరే విధంగానూ ఒక పౌరుడి ప్రాణాలకు, స్వేచ్ఛకు ఆటంకం రాకూడదని 21వ అధికరణం హామీనిస్తుంది. కాని ఇక్కడ అసలు చట్టం ఏమిటి అన్నదే వివాదమైనప్పుడు దాన్ని అమలు చేయడం కూడా కష్టతరమవుతుంది. ఈ కొత్త చట్టాలు ఏం చెబుతున్నాయనే దానిపైనే అనిశ్చితిని, అస్పష్టతను తెచ్చిపెడతాయి. ఈ నూతన చట్టాలు వచ్చిన తర్వాత నేర కేసులు 30 శాతం ఎక్కువగా జాప్యం జరుగుతుందని సీనియర్ లాయర్లు చెబుతున్నారు. వేల మందికి, ప్రత్యేకంగా వనరులు లేని వారికి న్యాయం నిరాకరించబడటానికి ఇది దారి తీస్తుంది. అసలు కేసుల పెండింగుపై దీని ప్రభావం ఏమిటనేది లెక్క కట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నించిన దాఖలాలే కనిపించవు. ఎందుకంటే దాన్ని సర్కారు ఖాతరు చేయదల్చుకోలేదు. అనువాదం చేయడానికి, అమలు చేయడానికి సంబంధించిన సమస్యలు ఎలాగూ తప్పవు గనక అనివార్య చిక్కులుగా వదిలేయవచ్చు. కాని ఈ నూతన చట్టాలలో కొన్ని సెక్షన్లు అత్యంత నిరంకుశమైనవి, మరికొన్ని సెక్షన్లు న్యాయం అందించడంలో అవరోధాలు సృష్టించేవిగా వున్నాయి.

**పోలీసులకు నిరంకుశాధికారాలు :** న్యాయాన్ని చేరుకోవడంలో మొదటి అడుగు ఎఫ్ఐఆర్. ఈ కొత్త చట్టాల కింద మూడు నుంచి ఏడేళ్ల వరకూ జైలు శిక్ష పడే అవకాశమున్న ఏదైనా నేరానికి సంబంధించిన ఎఫ్ఐఆర్ 14 రోజుల వరకూ జాగు చేయొచ్చు. ఈ విషయానికి సంబంధించిన వివిధ కోణాలను అధ్యయనం చేయడంలో స్టేషన్ హౌస్ అధికారి ఆలోచనలు కొనసాగించవచ్చు. బాధితులైన అతడు / ఆమె తమ ఫిర్యాదును ఉపసంహరించాలంటూ ఈ కాలంలో ఒత్తిడి తీసుకురావచ్చు. ఇది పోలీసులలోనూ అవినీతిని దారితీయొచ్చు. తమను తాము కాపాడుకోవడానికి రకరకాలైన పద్ధతులకు పాల్పడే అవకాశం అతడు / ఆమెకు లభించవచ్చు. ఈ కొత్త చట్టాలు తీసుకొచ్చిన మార్పుల వల్ల పేదలు బలహీనులు న్యాయం పొందే హక్కుకు అంత్యంత తీవ్రమైన హాని కలుగుతుంది. వారిప్పటికే అనేక విధాల న్యాయం పొందే హక్కును ఉపయోంచుకోలేకపోతున్నారు. అలాగే ఈ కొత్త చట్టాల ప్రకారం పోలీసులు గత చట్టంలో పేర్కొన్న 15 రోజుల కాలపరిమితిని మించి అధికకాలం పాటు రిమాండులో వుంచాలని కోరవచ్చు. తరచూ నేరాలు చేసేవాళ్లకు (ఇదో కొత్త తరహా విభజన) ఈ కొత్త చట్టం ప్రకారం సంకెళు కూడా వేయొచ్చు. పేదలు, బలహీనులకూ, అణచివేయబడిన వారికి, ప్రభుత్వ ప్రయోజనాలకు హాని కలిగించేవారుగా పోలీసులు భావించేవాళ్లకు న్యాయాన్ని నిరాకరించే అధికారం మరింత పెరుగుతుంది.

**124 ఎ మరింత తీవ్రరూపంలో :** ఈ నూతన చట్టాలలో అత్యంత ప్రమాదకరమైన మరో అంశమేమంటే 124 ఎ మరో రూపంలో ప్రత్యక్షం కావడం. రాజద్రోహాన్ని నిర్వచించే ఐపిసి 124 ఎ సెక్షన్‌ను సుప్రీం కోర్టు ఇప్పటికే కొట్టివేసింది. కానీ భారతీయ న్యాయసంహితలో 152వ సెక్షన్ మళ్లీ ప్రత్యక్షమవుతోంది. ఇంతకు ముందట మూల చట్టం 124ఎ లో లేని విధంగా ఇందులో భారత సార్వభౌమత్వం, సమగ్రత అనే ప్రస్తావనలు అదనంగా చేర్చబడ్డాయి. సీనియర్ లాయర్లు చెప్పే ప్రకారం చట్టంలో ఇదివరకు లేని 'జాతి వ్యతిరేక చర్య' అనే అంశం కొత్తగా జొప్పించబడింది. సహజంగానే ఇది వాక్ స్వాతంత్రాన్ని భావ వ్యక్తీకరణను అసమ్మతి హక్కును తీవ్ర స్థాయిలో దెబ్బ తీస్తుంది. వాటికి వ్యతిరేకంగా పని చేస్తుంది. ఈ కొత్త చట్టాలు తీసుకురాక ముందే ఈ ప్రభుత్వం అసమ్మతిదారుల పట్ల వ్యవహరించిన తీరు చాలా దూకుడుగా అన్యాయంగా వుండింది. ఇక ఈ కొత్త చట్టాలతో పరిస్థితి ఇంకా దిగజారుతుంది. అంతేగాక ప్రస్తుతం ఉపా చట్టం కింద వున్న అనేక నేరాలను ఈ కొత్త నేరచట్టంలో పొందుపరిచారు. అంటే నిందితుడు వాస్తవంలో కొత్తనేర చట్టంలో ఉపా కింద ఎన్ఐఎ, కొత్త నేర చట్టం కింద పోలీసులు పెట్టే రెండు రకాల చార్జిషీట్లు ఎదుర్కొనవలసి వుంటుంది. చివరకు ఒకే శిక్ష విధించినా ఈ ఈ మొత్తం ప్రక్రియే తీవ్ర శిక్షలా నడుస్తుంది. పైగా ఉపా కింద దర్యాప్తు చేసేది స్థానిక పోలీసు కన్నా పై స్థాయి అధికారి కాగా కొత్త చట్టంలో మామూలు పోలీసు స్టేషన్‌కే టెర్రరిజంపై దర్యాపు చేసే హక్కు వుంటుంది. ఉపా కింద విచారణ జరిపేందుకు ప్రభుత్వ అనుమతి అవసరం కాగా కొత్త చట్టంలో ఒక సాధారణ పోలీసు అధికారి కూడా ఎవరినైనా టెర్రరిజం పేరిట దర్యాప్తు జరిపే అధికారం పొందడం ఇంకా ఆందోళన కలిగించే విషయం.

**నిలిపేవరకూ పోరాటం :** ఈ నూతన చట్టాలపై గట్టిగా పోరాడాల్సి వుంది. దేశ వ్యాపితంగా న్యాయవాద సంఘాలు నిరసనలు, కోర్టుల బహిష్కరణకు సన్నాహాలు చేస్తున్నాయి. సుప్రీం కోర్టును ఉద్దేశించి పిటిషన్లపై వేలాది మంది సంతకాలు చేసి పంపారు. ఈ చట్టాల గురించిన సమాచారం మరింత విస్తృతంగా తెలిసేకొద్దీ నిరసనలూ వ్యతిరేకత పెరుగుతూనే వుంటాయి. ప్రజాభిప్రాయం నిర్మించడం ద్వారా ఎన్‌డిఎ సర్కారుపై ఒత్తిడి తెచ్చి ఈ కొత్త చట్టాల అమలును నిలుపు చేయవలసిన పరిస్థితి తీసుకు రావాలి. వాటిని తాజాగా మరోసారి సమీక్షించాలి. ఎందుకంటే ఈ చట్టాలు దేశంలోని పౌరులందరి జీవితాలకూ స్వేచ్ఛకు ప్రమాదకరంగా పరిణమించనున్నాయి. వాటిని ఇప్పుడున్న రూపంలో ఆమోదించే ప్రసక్తే వుండకూడదు.




# పిల్లల ప్రపంచం మాయమైపోతోంది!!

పిల్లల్ని తోటలో పువ్వులుగా అభివర్ణిస్తాడు ప్రముఖ విద్యా సంస్కర్త ఫ్రెడరిక్ ఫ్రోబెల్. ఆయన పిల్లల కోసం ఎంతో కృషి చేశాడు. వారి కోసం కిండర్ గార్డెన్ అనే పద్ధతిని ప్రవేశపెట్టాడు. పిల్లల తోట అని దాని అర్థం.పిల్లల ప్రపంచం ఒక తోట అయితే పిల్లలు మొక్కలకు పూచే పువ్వుల లాంటి వారు. వారు ఎంతో సున్నితమైనవారు, వారిని చాలా జాగ్రత్తగా చూసుకోవాలని చెప్పాడు. నిజానికి దీని ఆధారంగా రూపొందినదే ప్లే స్కూల్ అని కూడా చెప్పవచ్చు. కానీ ప్రస్తుతం ఎక్కడ ఉంది ఇలాంటి పిల్లల ప్రపంచం. కిండర్ గార్డెన్ లో చెప్పిన ఆడుకోవడం ద్వారా నేర్చుకోవడం అనే పద్ధతిని ఎంతమంది తల్లిదండ్రులు పిల్లల కోసం ఉపయోగిస్తున్నారు. ఎంతసేపు వాళ్ళను పుస్తకాలకు కట్టేసి చదివించినవే చదివించి, వాటిని బట్టి పట్టించి పిల్లల్ని ఒక కృత్రిమ జీవితంలో పెద్దలే నాటుతున్నారు.

**ఏది పిల్లల ప్రపంచం :** నిజానికి బాల్యం ఎంతో అందమైనది. ఒక వయసొచ్చాక ఆ బాల్యాన్ని చూసి సంతోషపడి వాటిని చాలా గొప్ప జ్ఞాపకాలుగా చేసుకోవడం కొందరిలో కనిపిస్తూ ఉంటుంది. కానీ ఇప్పుడు ఉన్న పిల్లలు రేపటి రోజున తమ బాల్యాన్ని గుర్తుచేసుకుంటే వాళ్లకు కనిపించేది ఏమిటి?? పుస్తకాలు, బట్టి పట్టిన గంటలు, తల్లిదండ్రుల కళ్ళలో కనిపించిన కాఠిన్యం, ఉపాధ్యాయుల ముఖాలలో ఎరుపు, ఇంకా వారి చేతి బెత్తం దెబ్బలు. ఇవేనా??


**ఒకప్పుడు పిల్లల ప్రపంచం ఎలా ఉండేది :** బాల్యాన్ని గురించి వర్ణించాలంటే ఆ బాల్యాన్ని రుచిచూసిన వారికే సాధ్యం అని అనిపిస్తుంది. స్వేచ్ఛగా బుల్లి గువ్వలా ఎలాంటి సమస్య లేకుండా ఇల్లంతా దొగ్గాడుతూ మొదలై అమ్మమ్మలు, నాన్నమ్మలు, తాతయ్యల దగ్గర కథలు వింటూ, నీళ్లతోనూ, మట్టితోనూ, ప్రకృతికి దగ్గరగా పెరుగుతూ ఓ పచ్చని మొక్కలాగే ఆహ్లాదంగా అనిపిస్తారు.

**కానీ ఇప్పుడు :** మట్టిలో ఆడటం, నీళ్లలో తడవడం, తుళ్ళుకుంటూ బయట తిరుగుతూ ఆడటం మొదలైనవన్నీ ఒక అసహ్యపు చర్యగా చూస్తారు. ఇంకా పాఠ్యపుస్తలను మాత్రమే చదవడం నిజమైన జ్ఞానం అనే భ్రమలో ఉన్నారు. బయట ప్రపంచం ఏమీ తెలియకుండా పెంచుతారు. ఇలా బయట ప్రపంచానికి దూరంగా పెంచడం వల్ల పిల్లలకు సంపాదించడం,ఉద్యోగాలు చేయడం తప్ప ఇంకేమీ తెలియకుండా పోతుంది. అమాయకపు నవ్వులు, అల్లరి



చేష్టలు, ఆటలు, పాటలు, ఇంకా చెప్పాలంటే శ్రీశ్రీ తన శైశవ గీతిలో చెప్పినట్టు మెరుపు మెరిస్తే వాన కురిస్తే ఆకాశమున హరివిల్లు విరిస్తే అవి మీకే అని ఆనందించే కూనల్లరా!! అంటూ సంతోషంగా చూసుకోవడానికి ఇప్పటితరానికి బాల్యమనేది మధురంగా ఉందా? ముఖ్యంగా పండుగలు, వేసవి సెలవులు, శుభకార్యాలు వంటి వాటికి సొంత ఊళ్లకు వెళ్లడానికి, బంధువులు, స్నేహితులలో కలవడానికి చాలామంది తల్లిదండ్రులు చెప్పుకుంటున్న సమర్థింపు "పిల్లలకు స్కూల్ పోతుంది" అని. వేసవిలో అటు ఇటు పంపకుండా ఎదో ఒక కోర్స్ లోనో, లేదా తదుపరి తరగతులకు స్పెషల్ కోచింగ్ లలో తోసేయడమో ఇలా పిల్లలకు ఎలాంటి సరదాలు, సంతోషాలు అనేవి ఏమీ లేకుండా చిన్నతనం నుండే వాళ్లలో ఇంజినీరింగ్, డాక్టర్, ias, ips అంటూ ఎన్నెన్నో ఆలోచనలు నాటి చివరకు విలువలు లేని జీవితాన్ని వాళ్లకు అప్పగిస్తున్నారు. విలువలు అంటే పుస్తకాల నుండి నేర్చుకునేవి కాదని, అవి జీవితాలను, సమాజాన్ని, బయట ప్రపంచాన్ని చూస్తూ నేర్చుకోవడం అని. కింద పడి దెబ్బ తగిలితే ఇంకోసారి పడకూడదు అనే జాగ్రత్త పిల్లలకు అర్థమవుతుందని పెద్దలు తెలుసుకోవాలి. అంతేకానీ పిల్లలు కిందపడకుండా వాళ్ళను ఎత్తుకునే తిప్పడం వల్ల వాళ్లకు నడవడం ఎలాగో తెలియకుండా పోతుంది. అందుకే చాలామందికి జీవించడం ఎలాగో తెలియకుండా పోతోంది. మాయమైపోతున్న పిల్లల ప్రపంచాన్ని ఏ డాక్యుమెంటరీలలో, కార్టూన్ చానల్స్ లో పిల్లలకు చూపించకుండా వారిని వారిగా ఎదగనిస్తే పిల్లల జీవితాలు పచ్చగా ఉంటాయి.

# యవ్వనంగా ఉండటమే కాదు..




తెల్లజుట్టుతో కనిపించాలని ఎవరూ కోరుకోరు. కానీ వద్దంటే రాకుండా అది ఆగనే ఆగదు. కొందరిలో చిన్నవయసులోనూ, మరికొందరిలో ఒక వయసు దాటిన తరువాత తెల్లజుట్టు వచ్చే తీరుతుంది. పెద్ద వయసులో తెల్లజుట్టు వస్తే కాసింత కాంప్రమైజ్ అయ్యి దానికి హెన్నానో, హెయిర్ డై వంటివి పెట్టి కవర్ చేస్తారు. కానీ చిన్నవయసులోనే తెల్లజుట్టు వస్తేమాతం వయసు ఎక్కువ ఉన్నట్టు కనిపిస్తారు. లోపలినుండి జుట్టు నల్లబడేలా చెయ్యాలి. ఆ పనిని ఈ కింద చెప్పుకోబోయే నాలుగు ఆహారాలు సమర్థవంతంగా చేస్తాయి.

**ఉసిరికాయలు :** ఉసిరికాయలు నవంబర్, డిసెంబర్ నెలల్లో అందుబాటులోకి వస్తాయి. ఫిబ్రవరి, మార్చి నెలల వరకు దొరుకుతాయి. పచ్చి ఉసిరికాయలను మిక్సీ వేసి జ్యూస్ చేసుకుని దాన్ని కాసిన్ని నీళ్లలో కలుపుకుని తాగాలి. లేదంటే పచ్చి కాయలు అయినా తినచ్చు. ఉసిరికాయను ఎండబెట్టి పొడిచేసుకుని ఏడాది పొడవునా ఉపయోగించుకోవచ్చు. రోజూ ఉసిరికాయను తీసుకుంటూ ఉంటే తొందరలోనే తెల్లజుట్టు తగ్గిపోతుంది.

**నల్ల ద్రాక్ష :** ద్రాక్షలో రెండు రకాలున్నాయి. వీటిలో నల్ల ద్రాక్ష తెల్లజుట్టుకు భలే మ్యాజిక్ చేస్తుంది. తాజా నల్ల ద్రాక్ష లేదా.. ఎండిన నల్లద్రాక్షను ప్రతిరోజూ తింటూ ఉంటే తెల్లజుట్టు నల్లగా మారుతుంది. ఎండిన నల్ల ద్రాక్షను రాత్రి నానబెట్టుకుని ఉదయాన్నే పరగడుపున తినవచ్చు కూడా.

**నల్లనువ్వులు :** నల్లనువ్వులు ఆడవాళ్లకు చాలా మంచిది. అమ్మాయిలు రజస్వల అయినప్పుడు. మహిళలు డెలివరీ అయిన తరువాత, ఆపరేషన్లు అయినవాళ నల్లనువ్వులు తింటే నడుము బలపడుతుందని, ఎముకలు ఆరోగ్యంగా ఉంటాయని చెబుతారు. ఇందులో కాల్షియం, ఐరన్ సమృద్ధిగా ఉండటం వల్ల రక్తహీనత సమస్య కూడా అస్సలుండదు.

**కరివేపాకు :** కరివేపాకును నూనె తయారీలో ఎక్కువగా వాడతారు. కానీ కరివేపాకును ప్రతిరోజూ తింటూ ఉంటే జుట్టు భలే నల్లగా మారుతుంది. ఇందులో విటమిన్–ఎ, విటమిన్–బి, విటమిన్–సి, విటమిన్–బి12 మొదలైనవి మెండుగా ఉంటాయి. కరివేపాకుతో వివిధ రకాల వంటలు చేసుకుని తింటే రుచికి రుచి, తెల్లజుట్టు మటాష్.




# చాణూర ముష్టికులు ఎవరు? వారి వృత్తాంతం ఏంటి!

చాణూర ముష్టికులు కంసరాజుకు నమ్మిన బంటులు. వారు సంసుడి సమావేశంలో కంసుడి వెనుక నిలబడుకుని ఉండగా అక్కడికి బలరామకృష్ణులు వెళ్లారు. చాణూరుడు కృష్ణుడి దగ్గరకు వెళ్ళి 'కృష్ణా! నువ్వు చిన్నవాడివని మేమనుకోవడం లేదు. వేయి ఏనుగుల బలంగల కువలయాపీడాన్ని అనాయాసంగా కూల్చివేశావు. నీ శక్తిసామర్థ్యాలను మల్ల యుద్ధంలో చూపి మా చక్రవర్తికి ఆనందం కలుగజేయి. 'మా మల్లయుద్ధ విశారదులు నీతో తలపడతారు. బరిలో వారితో పోరాడి మాకు వినోదం కలిగించు' అన్నాడు. కృష్ణుడు సమ్మోహకరంగా నవ్వి 'యోధులూ, యుద్ధ విశారదులూ అక్కర్లేదు. నేను నీతో తలపడతాను. మా అన్న బలరాముడు ముష్టికుడితో తలపడతాడు. ఇష్టమయితే ముందుకు రండి' అన్నాడు. ఆ మాటలకు చాణూరుడికి రోషం వచ్చింది. మహారాజు సైగతో చాణూర ముష్టికులు రామకృష్ణుల మీదకు దూకారు. ముష్టికుడు అతి భీకరంగా గర్జించాడు. జబ్బలు చరిచాడు. ఆ ధ్వనికి బెదిరిపోయినట్టు కృష్ణుడు గబగబా బలరాముడి వెనక్కి వెళ్ళి దాక్కున్నాడు. అది చూసి చాణూరుడు పగలబడి నవ్వాడు. 'నవమన్మథ మొలకా! యుద్ధమంటే ఆడపిల్లల్నీ, గొల్ల పిల్లల్నీ వెంటేసుకుని బృందావనంలో తిరగడంకాదు. మా జబ్బల చరుపు మీ నారదుడి వీణానాదంలా వుండదు. మా బాహునాదం విని తట్టుకోవడానికి గుండెధైర్యం కావాలి. రా! గొల్లపిల్లడా! ధైర్యముంటే ముందుకు రా' అని హేళన చేశాడు. మాధవుడు మందగమనంతో ముందుకు వచ్చి నిలిచాడు. తన లీలామానుష స్వరూపాన్ని ప్రదర్శించాడు. శక్తికి ప్రతిరూపంలా చెలరేగాడు. హోరాహోరీగా పోరు సాగింది. మల్లులకు పిడుగు



మాదిరిగా, చాణూర ముష్టికులకు అంకుశంలా, కంసరాజుకు మృత్యుదేవతగా, అజ్ఞానులకు అల్పుడుగా, పెద్దలకు తత్త్వస్వరూపుడిగా, కన్నెలకు నవమన్మథుడుగా, యాదవులకు సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడిగా నల్లనయ్య గోచరించాడు. చాణూర ముష్టికులు బలరామకృష్ణుల ధాటికి తట్టుకోలేక పోయారు. శ్రీకృష్ణుడు చాణూరుడ్ని పట్టుకొని గిరగిర తిప్పి నేలకేసి కొట్టాడు. అతను నెత్తురు కక్కుకుని ప్రాణం వదిలాడు. బలరాముడు ముష్టికుడ్ని పడద్రోసి పాదాలతో తొక్కి చంపాడు. సభలో హాహాకారాలు, హర్షధ్వానాలు, జయజయ నాదాలు చెలరేగాయి. సభలోని మల్లులందరూ బెదిరి తలో దిక్కుకూ చెదిరిపోయారు. పూర్వం అమరావతీపురంలో ఉతథ్యుడనే ఒక మహర్షి ఉండేవాడు. ఆయనకు అయిదుగురు కుమారులు. అమిత సౌందర్యమూర్తులు. వారు పెరిగి పెద్దవారయ్యారు కానీ, విద్యాబుద్ధులు మాత్రం అబ్బలేదు. అయినదానికీ, కానిదానికీ అందరితో కయ్యానికి కాలు దువ్వేవారు. బలాధిక్యత మాత్రమే కలిగింది వాళ్ళకు. అది చూసి ఉతథ్యుడు బాధపడి, కొడుకులు భ్రష్టులైనారని భావించి వారికి ధర్మమార్గాన్ని బోధించాలని ఎంతగానో ప్రయత్నించాడు. కాని ఆయన ప్రయత్నాలు ఫలించలేదు. తండ్రి మాట కొడుకులు ఇసుమంతైనా వినేవారు కాదు. రాక్షసంగా ప్రవర్తించేవారు. ఉతథ్యుడు ఒకసారి కోపం పట్టలేక 'మీరు రాక్షసులై పుట్టి, రాక్షససంపర్కం పొంది మల్లవిద్యాప్రదర్శకులుగా చరిస్తారు' అని ఐదుగురు కొడుకుల్నీ తీవ్రంగా శపించాడు. తండ్రివల్ల ఆ విధంగా శపింపబడ్డ సోదరులే ఆ తరువాత చాణూరుడు, ముష్టికుడు, కళలుడు, తోశాలకుడు, కూటుడు అనే అసురులుగా పుట్టి, కంసుని కొలువులో చేరి, చివరికి నల్లనయ్య చేతిలో శాప విముక్తి పొందారు.

# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి
డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

గురువారం/ జూలై/11/2024

04

www.viswamvoice.com


## రైల్వే రిజర్వేషన్ కౌంటర్
# తిరిగి ప్రారంభించండి



**అంబాజీపేట, విశ్వంవాయిస్ న్యూస్ :** అమలాపురంలో ఉన్న రైల్వే రిజర్వేషన్ కౌంటర్ ఇటీవల తొలగించడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు కొడుతున్నారని, తిరిగి వెంటనే రైల్వే రిజర్వేషన్ కౌంటర్ కొనసాగించాలని కోకో ఫెడ్ తరఫున అరిగెల బలరామూర్తి అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్, పి గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణకు వినతి పత్రం సమర్పించారు . రైల్వే రిజర్వేషన్ కౌంటర్ పై ఎంపీ ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు . సివిల్ సప్లయ్ వారి ఆదేశములు పాటించి వినియోగదారుల సంఘాల సమాఖ్య ప్రతి నిధులను సంభందిత సలహా సంఘాల సభ్యుల కు ఆహ్వానము పంపాలని ఆదేశములు ఇవ్వవలసినదిగా ఎమ్ పి హరీష్ మాధుర్ని, ఎమ్ ఎల్ ఏ గిడ్డి సత్య నారాయణ ని కోకో ఫెడ్ చైర్ పర్సన్ అరిగెల బలరామ మూర్తి, కార్యదర్శి ఆదిత్య కిరణ్ కోరారు.

## ఆగస్టు 15 నాటికి మోరంపూడి ఫ్లైఓవర్
# ప్రజలకు అందుబాటులోకి రానుంది

**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** ప్రజా ప్రయోజనాల దృష్ట్యా నిరంతరం రద్దీ ప్రదేశమైన మోరంపూడి జంక్షన్ వద్ద నిర్మిస్తున్న మోరంపూడి ఫ్లైఓవర్ ను ఆగస్టు 15 నాటికి ప్రజలకు అందుబాటు లోకి తీసుకురానున్నమని పార్లమెంట్ సభ్యులు దగ్గుబాటి పురందేశ్వరి పేర్కొన్నారు. బుధవారం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, మాజీ ఎంపీ మాగంటి మురళీమోహన్ తో కలిసి మోరంపూడి ఫ్లైఓవర్, సర్వీస్ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ పురందేశ్వరి మాట్లాడుతూ రాజమహేంద్రవరం నగరంలో ట్రాఫిక్ సమస్యను అధిగమిస్తూ ప్రమాదాలను నియంత్రించే విధంగా జాతీయ రహదారి మోరంపూడి జంక్షన్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని ఆగస్టు 15న నాటికి ప్రజల అంకితం చేయడం జరుగుతుందన్నారు. జాతీయ రహదారి 216 పైన 1.42 కిలోమీటర్ల నిడివి తో నాలుగు లైన్ల ఫ్లైఓవర్ ను గతం లో 60 కోట్లు అంచనా వ్యయం తో ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రస్తుతం సర్వీస్ రోడ్డు స్థల సేకరణ, ప్రాజెక్టుకు సంబంధించి

**ఎంపీ పురందేశ్వరి,ఆదిరెడ్డి శ్రీనివాస్, మాజీ ఎంపీ మురళీమోహన్**



ఇతర అభివృద్ధికి గాను సుమారు రు. 100 కోట్ల రూపాయల కేంద్ర నిధులు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. ఇందుకు అవసరమైన అంచనాలను వెంటనే సిద్ధం చేసి తమకు సమర్పించాలని జాతీయ రహదారి ప్రాజెక్టు డైరెక్టర్ డి. సురేంద్రనాధ్ కు సూచించారు. ఆగస్టు 15 నాటికి ఫ్లైఓవర్ ప్రజా వినియోగార్ధం పూర్తిస్థాయిలోకి తేవటమే తమ లక్ష్యమని ఈ సందర్భంగా ఆమె అన్నారు. రాజమహేంద్రవరం నగర శాసనసభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ మోరంపూడి ఫ్లైఓవర్ గతంలో తమ ప్రభుత్వ హయాంలోనే రు.60 కోట్ల రూపాయల నిధులతో ప్రాజెక్టు శంకుస్థాపన చేయటం జరిగిందని, తదుపరి జాప్యం కారణంగా నేటి వరకు ఫ్లైఓవర్ పనులు నత్తనడకన సాగిందని ప్రస్తుతం మళ్లీ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినందున ఫ్లైఓవర్ పనులకు అంచనా వేయవలసినదిగా నేషనల్ హైవేస్ ఆధారటీ అధికారులకు సూచించడం జరిగిందని ప్రస్తుతం రు. 100 కోట్లతో ఫ్లైఓవర్ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టి సాంకేతిక పరంగా ఎటువంటి ఇబ్బందులు ఉన్నప్పటికీ వాటన్నింటిని పరిష్కరించి త్వరలోనే పూర్తి చేస్తామని అందుకు తమ వంతు కృషి చేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ హెచ్ ఏ ఐ ప్రాజెక్ట్ డైరెక్టర్ డి సురేంద్రనాథ్, స్థానిక నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యాపురం బ్యాంకు ఎన్నికలకు
# నేడు నామినేషన్లు



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** ఈనెల 20న జరుగనున్న ప్రతిష్టాత్మక ఆర్యాపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ 11న (గురువారం) నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి వి.కృష్ణకాంత్ తెలిపారు.12 న నామినేషన్ల పరిశీలన,13 న నామినేషన్ల ఉపసంహరణజరుగుతాయన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు గోకవరం బస్టాండ్ వద్ద ఉన్న బ్యాంకు ప్రధాన శాఖలో నామినేషన్లు దాఖలు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. దీనికి సంబంధించి తూర్పుగోదావరి జిల్లా సహకార అధికారి ఆర్.శ్రీరాముల నాయుడు బుధవారం ఆర్యాపురం బ్యాంకును సందర్శించి నామినేషన్ల స్వీకరణకు చేసిన ఏర్పాటను పరిశీలించి తగు సూచనలు చేశారు.ఈసందర్భంగా ఎన్నికల అధికారి వి.కృష్ణకాంత్, బ్యాంకు సీఈఓ కె.స్వరాజ్యలక్ష్మి నామినేషన్ల కోసం చేసిన ఏర్పాటను శ్రీరాములనాయుడికి వివరించారు.

## పంట కాలువలు, డ్రైనేజీలలో
# పూడికతీత పనులు చేపట్టండి

**జిల్లా కలెక్టర్ అర్ మహేష్ కుమార్ ఆదేశాలు**



**అమలాపురంటౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** సాగునీరు ముంపు నీరు సవ్యంగా పారేలా రైతులకు భరోసాగా నిలవాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లో ఉపాధి హామీ పథకం అమలు తీరుపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్.ఎస్. జి.ఎస్.పథకం పారదర్శకం జవాబు దారితనంతో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ సామా జిక తనిఖీ ప్రక్రియల ద్వారా విజయవంతంగా కొనసాగించాల న్నారు .సగటున ప్రతి కుటుంబానికి వంద రోజులు పని దినాలు కల్పనకై పాటుపడాలన్నారు. అదేవిధంగా సరాసరి వేతనాలు రూ 300 పొందే విధంగా సిబ్బంది చర్యలు చేపట్టాలన్నారు పాఠశాలల ప్రాంగణాలు, మొక్కలు నాటి మూడు సంవత్సరాలు పాటు పెంపకం నిర్వహణ చేపట్టాలని అలాగే ఎవెన్యూ ప్లాంటేషను కూడా చేపట్టి పర్యావరణ పరిరక్షణ జీవ వైవిధ్యానికి తోడ్పాటునందిం చాలన్నారు. కొబ్బరి తోటల్లో అంతర్ పంటలు సాగుకు ఉపాధి హామీ అనుసంధానంతో ఎక్కువగా పనులు చేపట్టాలన్నారు .నిరుపేద కూలీల జీవితాలకు ఆర్థిక భరోసాతో పాటు వలసలు నివారణ పర్యావరణ పరిరక్షణ, ఉద్యానసాగు పనులకు ఉపాధి వేతనాలు పొంద డం వంటి ఉభయతారకమైన ప్రయోజనాలే లక్ష్యంగా అమలు కాబడుతుందన్నారు అదేవిధంగా 60 శాతం కూలి వేతనాలు 40 శాతం మెటీరియల్ కాంపోనెంట్ తో గ్రామాలలో సీసీ బరియల్ గ్రౌండ్, ప్రహరీ గోడలు వంటి వసతులు కల్పించుకోవడం జరుగుతుందన్నారు గ్రామాలలో నలుగురికి అవసరమైన ఊరి ఉమ్మడి పనులు చేపట్టడం ద్వారా గ్రామాల రూపు రేఖలు మారుతున్నాయన్నారు. జిల్లాలో ఉపాధి హామీ పథకం అమలు తీరును అధికారులను అడిగి తెలుసుకుని పలు సూచనలు ఆదేశాలు జారీ చేశారు .శారీరక శ్రమతో కూడుకొని అంతగా నైపుణ్యం అవసరం లేని పనులను కర్పించడం మహాత్మ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఉద్దేశ్యమన్నారు. అన్ని పారామీటర్లలో జిల్లాను ముందంజలో నిలిపి అన్ని విధాలుగా గ్రామీణ అభివృద్ధిలో కీలక భూమిక పోషించాలన్నారు. కన్వర్జెన్సీ మోడ్ లో కూడా పనులు చేపడుతూ మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలన్నారు వేతన జీవుల సంక్షేమానికి ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను వర్తింపజేసి వారికి భరోసాగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నీటి యాజ మాన్య సంస్థ పథక సంచాలకులు ఎస్ మధుసూదన్ , జిల్లా పంచాయతీ అధికారి దాసరి రాంబాబు,హెచ్ఆర్ త్రినాథ్ ఉపాది హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రం లేబర్ కోడ్‌లను
# వెంటనే రద్దు చేయాలి

**కార్మికులు నినాదాలు చేసి డిమాండ్స్ డేను విజయవంతం**



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** శ్యామలా సెంటర్, రాజమహేంద్రవరంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శిలు ఎం.సుందరం బాబు, బి.పూర్ణిమరాజు ఆద్వర్యంలో కార్మికుల డిమాండ్స్ డే జరిగింది. ఈ కార్యక్రమానికి సీఐటీయూ అనుబంధ సంఘాలు అంగ న్వాడీ, ఆశా వర్కర్లు,మిడ్డేమీల్స్ కార్మికులు పాల్గొన్నారు. ఈధర్నాను ఉద్దేశించి సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు టి.అరుణ్,అంగన్వాడీ జిల్లా కార్యదర్శి కె.బేబి రాణి,ఆశా వర్కర్స్ జిల్లా అధ్యక్షురాలు అన్నా మణి,ఏపీ ఆర్ పిఏ.కార్యదర్శి రంగారావు మాట్లాడుతూ లోకసభ,ఎపి అసెంబ్లీ ఎన్నికలు జరిగి కేంద్రం లో రాష్ట్రంలో నూతన ప్రభుత్వాలు ఏర్పడ్డాయి అని గత ప్రభుత్వాలు కార్మికులకు వ్యతిరేకంగా ,కార్పొరేట్లకు అనుకూలంగా పనిచేసాయని,ఆ ప్రభుత్వాలకు ప్రజలు బుద్ధి చెప్పారని దీనివలన కేంద్రంలో బిజెపికి బలాన్ని బాగా తగ్గించారని,దేశవ్యాప్తంగా గత 5 ఏళ్లుగా జరిగిన కార్మిక,కర్షక పోరాటాల ఫలితంగా బిజెపి ఎంపీ స్థానాలు తగ్గాయని.అయినా కేంద్రం ప్రభుత్వం మళ్ళీ తన పాత విధానాలనే కొనసాగించడానికి నిర్ణయించుకుంది అని అందుకే దేశవ్యాప్తంగా జూలై 10 డిమాండ్స్ డే సీఐటీయూ నిర్వహించింది, అలాగే నూతనంగా ఏర్పడిన తెలుగుదేశం ప్రభుత్వం తమ ఎన్నికల హామీలను తీర్చక పోతే గత ప్రభుత్వం పరిస్థితే వస్తుందని తెలియజేసారు.కేంద్రప్రభుత్వం వెంటనే లేబర్ కోడ్ లను రద్దు చేసి పాత 44 లేబర్ చట్టాలను అమలుచేయాలని,ప్రభుత్వ రంగ సంస్థల ప్రేవేటీకరణను ఆపాలని,స్కీమ్ వర్కర్లను ప్రభుత్వ కార్మికులుగా గుర్తించి వారికి కనీస వేతనము,పెన్షన్,సామాజిక భద్రత కల్పించాలని,కనీస వేతనం నెలకు 26,000 నిర్ణయించి,అమలు చేయాలని, కాంట్రాక్టు,ఔట్ సోర్సింగ్,కంటిజెంట్, పార్ట్ టైం,గెస్ట్ తదితర కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి,కాంట్రాక్టర్ ని తొలగించి నా కార్మికులను తొలగించారాదు అని అందరినీ సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి అని రెగ్యుల ర్ చేయాలిఅని,ఓల్డ్ పెన్షన్ స్కీం (ఓపిఎస్) అమలు చేయాలి.నూతన పెన్షన్ స్కీం రద్దు చేయాలి.ఈపీఎఫ్ 95 పెన్షన్ కనీసం రూ.9000/-లు అమలు చేయాలిఅని,విశాఖ స్టీల్ ప్లాంటును పూర్తి సామర్ధ్యంతో నడపాలి.విశాఖ స్టీల్ ప్లాంట్ రక్షణ కు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలి అని తదితర డిమాండ్స్ తో కార్మికులు నినాదాలు చేసి డిమాండ్స్ డేను విజయవంతం చేశారు.ఈకార్యక్రమం లో సిపిఎం సీనియర్ నాయకులు పోలిన వెంకటేశ్వర రావు,ఐ.సుబ్రహ్మణ్యం,సి పి ఎం నగర కార్యదర్శి బి.పవన్,సీఐటీయూ జిల్లా నాయుకులు కర్రీ రామకృష్ణ,అంగన్వాడీ నాయకులు,అన్నపూర్ణ,శారద,సునీత,ఆశావర్కర్లు నాయకులు వెంకటలక్ష్మీ,ఏ పి ఆర్ పి ఏ. అధ్యక్షు,సోమేశ్వర రావు,మోహన్ రావు,పడాల రామ కృష్ణ,పెరయ్య లింగం, అర్జున్,ఎస్.ఎఫ్.ఐ.నాయకులు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## బౌద్ధమతానికి దగ్గరైన కళ
# చెడీ తాళింఖానా !

**శ్రీలంక బౌద్ధ బిక్షువు బొద్ది హీన్**



**అమలాపురం టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** 200 ఏళ్ళక్రితం ప్రాచీన యుద్ధకళలో భాగమైన చెడీ తాళింఖానా విద్యను మాయన్మార్ దేశంలో తన మేనమామ వద్ద నేర్చుకుని తెలుగు గడ్డకు పరిచేయం చేయడం చాలా గొప్ప విషయమని శ్రీలంక బౌద్ధ బిక్షువు బొద్ది హీన్ అన్నారు బుధవారం అమలాపురం పట్టణంలో అబ్బిరెడ్డి రామదాసు కుటుంబ సభ్యులైన అబ్బిరెడ్డి సురేష్ ను శ్రీలంక బౌద్ధ బిక్షువు బొద్ది హీన్ కలుసుకున్నారు.శ్రీలంకలో చెడీ తాళింఖానా విద్య పట్ల అక్కడి ప్రజలు ఆశక్తి చూపుతారని అటువంటి విద్య ను అబ్బిరెడ్డి రామదాసుతో పాటు, కుమారుడు నరసింహారావు, మనుమడు రామదాసు కాపాడుకుంటూ వచ్చి ఈ జనరేషన్లో మునిమనుమడు మల్లేష్ అమెరికాలో స్థిరపడినా యేటా దసరా ఉత్సవాలు నిర్వహించడం గొప్పవిషయం అన్నారు. తాను తెలుగు రాష్ట్రల్లో గత నెలరోజులుగా చాలా జిల్లాలు పర్యటించానని అబ్బిరెడ్డి రామదాసు ఏర్పాటు చేసిన తాళింఖానా చరిత్రను అడిగి తెలుసుకున్నారు, బ్రిటిష్ ప్రభుత్వం అబ్బిరెడ్డి రామదాసుకు తామ్రపత్రం ఇచ్చింది నాటి నుండి మూడోతరం రామదాసుకు ఆంధ్రరత్న అవార్డు వరించడం వరకు చాలా ఆనందం తెప్పించాయి అనంతరం అబ్బిరెడ్డి రామదాసు, నరసింహరావు, రామదాసు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గంగుమళ్ల శ్రీనివాస్,దూడల ఫణి, అబ్బిరెడ్డి మూర్తి, పప్పోప్పుల తనేష్, గారపాటి బాలాజీ,వల్లభరెడ్డి వాసు, సత్తి శివ, గుర్రాల రమేష్, దిలీప్ వింటి, బండారు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## అర్బన్ ఫుడ్ ప్లాజాను తొలగించాలని
# ఎమ్మెల్యే అదిరెడ్డికి వినతి

**మహిళా భద్రత పట్ల ఆందోళన వ్యక్తం చేసిన దళిత గిరిజన ప్రజాసంఘాల ఐక్యవేదిక**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** స్థానిక రాజమండ్రి ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఎస్.సి., ఎస్.టి. విద్యార్థినుల హాస్టళ్ళకు ఆనుకుని ఏర్పాటు చేసిన ఈట్ స్ట్రీట్ అర్బన్ ఫుడ్ ప్లాజా మహిళల భద్రత పట్ల వివాదాస్పదంగా మారుతోందని దళిత నాయకులు కాశి నవీన్ కుమార్, కోరుకొండ చిరంజీవి, మర్రి బాబ్జి, వైరల్ అప్పారావు ఆందోళన వ్యక్తం చేశారు. మొదట 33 షాపులతో ప్రారంభించబడి ప్రస్తుతం 100 స్టాల్స్ ఉండడం తో రాత్రి సమయంలో ప్లాజా వద్ద యువకులు, ప్రజలు, ఆకతాయిలు, తాగుబోతులు సందడి చేస్తూ భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారనన్నారు. దీని కారణంగా హాస్టల్లోని విద్యార్థినుల పై ప్రతికూల ప్రభావం పడి ఎస్.సి. బాలికల హాస్టల్లో సుమారు 400 పైగా విద్యార్థినులు, ఎస్.టి. బాలికల హాస్టల్లో 450 మంది విద్యార్థినులు ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. ప్లాజా వద్ద అర్ధరాత్రి వరకు కొనసాగుతున్న శబ్ద కాలుష్యం కారణంగా వారు ఏకాగ్రతతో చదవలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా అప్పుడప్పుడు ఆకతాయిలు, తాగుబోతులు అర్ధరాత్రి వరకు హాస్టల్స్ వద్ద సంచరిస్తూ తక్కువ ఎత్తులో ఉన్న గోడలు గోడలు దూకే ప్రయత్నాలు చేయడం ఆందోళన కలిగిస్తుంది అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రభుత్వం ఏర్పాటు చేసిన వసతి గృహాలలో సురక్షితంగా చదవాలనే ఉద్దేశ్యంతో ఈ ప్లాజా తొలగించాలనే డిమాండ్ చేస్తున్నట్లు వారు తెలిపారు. అంతేకాకుండా ఇటీవల 2 షాపులు అగ్నిప్రమాదానికి గురై, బాలికల హాస్టల్లోకి పొగలు వెళ్లడంతో విద్యార్థులు తీవ్ర ఆందోళన చెందారని గుర్తు చేశారు. ఈ మేరకు రాజమహేంద్రవరం నగర ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసుని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. దళిత గిరిజన ప్రజా సంఘాల ఐక్యవేదిక సదరు ఫుడ్ ప్లాజాను అక్కడ నుండి తొలగించి, విద్యార్థినులకు భద్రత కల్పించి, ప్రశాంతంగా చదువుకునే పరిస్థితులు కల్పించాల్సిందిగా కోరారు. దారా ఏసురత్నం, చాపల చినరాజు, మోతా నాగలక్ష్మి, బారు చిన్ని, అజ్జరపు రమేష్, బేరా చిన్న, కొలారి వెంకటరావు, బాబ్జి, ప్రభు, కృపామణి తదితరులు ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఉన్నారు.

## ఎల్.ఎల్.బిలో కాలేజీ టాపర్‌గా
# ఇమంది జ్ఞానేశ్వరి



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్:** రాజమహేంద్ర వరం నగరంలోని వీరవల్లి కాలేజ్ ఆఫ్ లా లో ఎల్.ఎల్.బి చదివిన ఇమంది జ్ఞానేశ్వరి డిస్ట్రిక్షన్ లో ఉత్తీర్ణత సాధించి కాలేజీ టాపర్ గా నిలిచారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ పరిధిలో 2024 విద్యాసంవత్సరం లో అత్యధిక మార్కులు సాధించి ఉత్తీర్ణత పొందిన విద్యార్థిని ఇమంది జ్ఞానేశ్వరి ఎం కామ్ ఎల్.ఎల్.బి చేశారు.ఆమె పద్మశాలి సంక్షేమ సంఘం తూర్పుగోదావరిజిల్లా అధ్యక్షుడు ఇమంది కన్నారావు కూమార్తె.ఆమె భర్త పొన్నగంటి అప్పారావు హైదరాబాద్‌లో ఎస్.బి.ఐ. చీఫ్ మేనేజర్‌గా చేస్తున్నారు.డిస్ట్రిక్షన్ లో ఉత్తీర్ణత సాధించి కాలేజీ టాపర్‌గా నిలిచిన ఇమంది జ్ఞానేశ్వరి వీరవల్లి లా కాలేజీ ప్రిన్సిపాల్ పి.సత్యనారాయణ చేతుల మీదుగా మెరిట్ సర్టిఫికెట్ అందు కున్నారు. అధ్యాపకులు టి.దిలీప్, శ్రీనివాస్,రాంబాబు, శంకరా చారి, సింధు తదితరులు ఇమంది జ్ఞానేశ్వరినిఅభినందిం చారు. ఈ సందర్భంగా జ్ఞానేశ్వరి మాట్లాడుతూ అందరికీ న్యాయం చేయాలని లా చదివానన్నారు.

# స్మశానాలు, దేవాదాయ భూములపై సర్కారీ సర్వే

**సర్వేలో నిమగ్నమైన రెవిన్యూ శాఖ**
**అలిఖిత ఉత్తర్వులతోనే కార్యాచరణ**

**శంఖవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లో నాలుగు దశాబ్దాల రాజకీయ జీవితంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కి రెండుసార్లు, అవశేష ఆంధ్రప్రదేశ్ కు మరో రెండు సార్లు ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు సేవలను అందించారు. 12 జూన్ 2024 న నాలుగోసారి ముఖ్యమంత్రి విధులను చేపట్టిన ఆయన పాలన ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం తోపాటు సంస్కరణల దిశగా కొనసాగుతోంది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో పెద్ద ఎత్తున అవినీతి జరిగినట్టు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో తొలుత శాఖల వారీగా చంద్రబాబు సమీక్షిస్తున్నారు. ఇదే సమయంలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములపై కూడా ఆయన నిశితంగా తన దృష్టిని సారించారు. ఈ క్రమంలో రాష్ట్రంలోని 26 జిల్లాల్లోని ప్రతీ నగరం, పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లోనూ ఇప్పటికి ఎన్ని స్మశాన వాటికలు ఉన్నాయి. అవి వాటి వాస్తవ విస్తీర్ణం ప్రకారమే పూర్వపు యధావిధి స్థితిలో ఉన్నాయా ? లేక ఆక్రమణల్లో ఉన్నాయా...? ప్రస్తుత యధాతధ పరిస్థితి ఏంటనే విషయమై చంద్రబాబు తాజాగా సర్వే చేయిస్తున్నారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిధిలోని భూములపై కూడా ఆ శాఖల ఆధ్వర్యంలో సర్వే చేయిస్తున్నారు. ఇటీవల ఆయన సంబంధిత శాఖల, జిల్లా కలెక్టర్ల అంతర్జాల సమావేశంలో తగు సూచనలు ఇచ్చారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఏవిధమైన లిఖిత పూర్వక ఉత్తర్వులనూ జారీ చేయకుండానే కేవలం మౌఖిక ఆదేశాల ప్రకారమే ఆయా జిల్లా కలెక్టర్ల నేతృత్వంలో సర్వే పనులను ప్రభుత్వం చేయిస్తోంది. దీంతో 2024 సార్వత్రిక ఎన్నికల అనంతరం మరో సారి రెవిన్యూ శాఖ సర్వే పనుల్లో తలమునకలైంది. దీనికి సమాంతరంగా



దేవాదాయ ధర్మాదాయ శాఖ కూడా తన భూములను కాపాడుకునే ప్రయత్నంలో సర్వే పనుల్లో నిమగ్నమైంది. ఆలయ భూములు ఆక్రమించే వారిపై చట్టం ప్రకారం కఠిన చర్యలు తప్పవని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ దేవాదాయ ధర్మాదాయ శాఖా మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి గత ఏడాది జూలై 29 న హెచ్చరించారు. ఆలయ భూముల పరిరక్షణకు పోలీసు శాఖతో కలిసి ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. దేవాదాయ శాఖ ఆస్తుల లీజుల అవినీతి విషయంలో కఠినంగా వ్యవహరించాలని, నామమాత్రపు ధరకు దుకాణాలు లీజుకు తీసుకుని తిరిగి వాటిని ఉప అద్దెలకు ఇస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, సుదీర్ఘ కాలంగా న్యాయస్థానాల్లో పెండింగులో ఉన్న దేవాదాయ శాఖ భూములపై ఉన్న వివాదాలను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఆ అనంతర కాలంలో ఆ రాష్ట్ర వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ ను నిర్వహించి ఆక్రమణల్లో ఉన్న వేలాది ఎకరాల భూములను వెనక్కి తీసుకుని, ఆ ఆలయ భూములకు సరిహద్దు బోర్డులను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. అదే మాదిరిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్కారు కూడా వ్యవహరించ నున్నట్టు వినికిడిలో ఉంది. అయితే ప్రభుత్వ విధాన నిర్ణయంతో మౌఖిక ఆదేశాల ప్రకారం కార్యాచరణ చేపట్టి నప్పటికీ అందుకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు విడుదల చేయక పోవడం, విధి విధానాలన ఖరారు చేయక పోవడంతో సర్వే అనంతరం ప్రభుత్వం ఏ చర్యలను చేపట్టనున్నదో ఇప్పట్లో స్పష్టం కావడం లేదు. రుద్రభూముల్లోని అక్రమలను తొలగించి స్మశానాలను పునర్మిస్తుందా... నిధులను విడుదల చేసి అభివృద్ధి చేసి వాటిని మరింత ప్రజా ప్రయోజనకరంగా తీర్చిదిద్దుతుందా అన్నది ప్రస్తుతానికి ప్రశ్నార్థకమే. ఇక ఆలయాల భూముల పరిరక్షణకు పోలీసు శాఖతో కలిసి ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ తెలంగాణ సర్కారు ఏర్పాటు చేసినట్టు ఆంధ్రా సర్కార్ కూడా ఏర్పాటు చేస్తుందేమో చూడాలి. ఆంధ్రాలో దేవాదాయ ధర్మాదాయ శాఖ సాగు భూముల కౌలు వేలాలను కొన్ని చోట్ల ఖరారు చేసి, మరికొన్ని చోట్ల ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు సాకుతో వాయిదా వేసిన విషయం తెలిసిందే. భూముల్లోని అన్యాక్రాంతాలను, ఆక్రమణలను తొలగించి, తాజాగా సరిహద్దులను స్థిరీకరించి, భూములను సంరక్షించడంతో పాటు వేలం పాటలను పునరుద్ధరించే అవకాశం లేకపోలేదు. ప్రభుత్వ మౌఖిక ఆదేశాల ప్రకారం ప్రస్తుతం స్మశానవాటికలను మాత్రం తాము సర్వే చేస్తున్నామని శంఖవరం మండల రెవిన్యూశాఖ అధికారులు కొందరు ధృవీకరించారు.

ఎమ్మెల్యే శిరీషాదేవి దంపతులను సత్కరించిన
## ఎమ్మార్పీఎస్ నేతలు



**రంపచోడవరం, విశ్వంవాయిస్ న్యూస్:** అల్లూరి సీతా రామరాజు జిల్లా రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి, భాస్కరరావు దంపతులను బుధవారం ఉదయం మర్యాద పూర్వకంగా కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు వారిని శాలువాతో సత్కరించి పుష్పగుచ్చం అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్, ఎం.ఎస్.పి. ఉత్తరాంధ్ర,కోస్తా జిల్లాల ఇంచార్జి మమ్మిడివరపు చినసుబ్బారావు మాదిగ ఎమ్మెల్యే దంపతులను ఆప్యాయంగా పలకరించి అభినంద నలు తెలిపారు. కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పెనుముచ్చి సురేష్, రంపచోడవరం నియోజకవర్గ స్థానిక ఎమ్మార్పీఎస్ నాయ కులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల అభివృద్ధికి సహకారం
## ఎల్లవేళలా వుంటుంది

**కొత్తపేట శాసనసభ్యులు బండారు సత్యానందరావు**



**కొత్తపేట, విశ్వంవాయిస్ న్యూస్ :** ఆలమూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని కొత్తపేట శాసనసభ్యులు బండారు సత్యానందరావు హామీ ఇచ్చారు. ఆలమూరు చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వి నరసింహ స్వామి, కళాశాల అధ్యాప కులు, సిబ్బంది వాడపాలెంలో బండారు సత్యానందరావును కలిసి కళాశాల స్థితిగతులను వివరించారు.ప్రస్తుతం డిగ్రీ అడ్మిషన్లలో మొదటి విడతలో బీకాం 10 మంది విద్యార్థులు బీఏ 10 మంది విద్యార్థులు బీఎస్సీలో నలుగురు విద్యార్థులు చేరడం జరిగిందని వారందరికీ మొదటి సంవత్సరం ఫీజు చారిటబుల్ ట్రస్ట్ భరిస్తుందని ఇంకా రెండు మూడు విడతల అడ్మిషన్లు ఉన్నాయని కళాశాల అధ్యాపక బృందం ఎమ్మెల్యేకు వివరించారు.జూనియర్ కళాశాల డిగ్రీ కళాశాల పక్కా భవనాలు నిర్మించడంతో పాటు కళాశాల అభివృద్ధికి తన సహకారం ఎల్లవేళలా అందిస్తానని, ఆలమూరు పరిసర ప్రాంత విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలని, అందరూ కలిసి కళాశాల అభివృద్ధికి కృషి చేయాలని బండారు సత్యానందరావు ఆకాంక్ష వ్యక్తం చేశారు.

టిడిపి సీనియర్ నేత పేర్రాజును పరామర్శించిన
## ఎంపీ హరీష్ మాధుర్



**కొత్తపేట, విశ్వంవాయిస్ న్యూస్** టిడిపి సీనియర్ నేత,సొసైటీ మాజీ అధ్యక్షులు ముదునూరి పేర్రాజును అమలాపురం పార్లమెంట్ సభ్యులు గంటి హరీష్ మాధుర్ గంటిలోని ఆయన నివాసంలో పరామర్శించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం గంటి గ్రామానికి చెందిన ముదునూరి పేర్రాజు మాజీ లోక్ సభ స్పీకర్ జి ఎం సి బాలయోగి కి అత్యంత సన్నిహితంగా ఉండేవారు.ఈ సందర్భంగా హరీష్ మాధుర్ పేర్రాజును పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.


# అన్న క్యాంటీన్ల కోసం విరాళాల సేకరణ



**శంఖవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** అన్న క్యాంటీన్ల పునరు ద్ధరణ విషయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. క్యాంటీన్ల నిర్వహ ణకు దాతల నుంచి విరాళాలను సేకరిం చాలనేది ప్రభుత్వ ఆలోచన. ఈ విరాళా లకు ఆదాయపు పన్ను మినహాయింపు లభిస్తుందని కూడా అధికారులు స్పష్టం చేస్తున్నారు. వీలైనంత వరకు దాతలపై భారం వేసి, మిగతా వాటికి ప్రభుత్వం నిధులు సమకూరుస్తుందని తెలుస్తోంది. అన్న క్యాంటీన్ల పేరుతో త్వరలో ట్రస్టును ప్రభుత్వం ప్రారంభించ బోతున్నది. అయితే ఈ సారి పూర్తిగా ప్రభుత్వంపై భారం పడకుండా.. దాతల సాయంతో అన్న క్యాంటీన్లు నిర్వహించేం దుకు అధి కారులు రంగం సిద్ధం చేశారు. విరాళాల సేకరణ మొదలు పెట్టారు. ఈ విరాళాల వివరాలను దాతలు, ప్రజల సందర్శ నార్థం పారదర్శకంగా అందు బాటులో ఉంచేందుకు ప్రత్యేకంగా ఓ వెబ్‌సైటును కూడా ప్రభుత్వ అధికారులు రూపొందిస్తు న్నారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వ పాలన చివరి రోజుల్లో అన్న క్యాంటీన్లంటూ హడావిడి చేశారు. 2019 లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి జగన్ నేతృత్వంలో ప్రభుత్వం మారాక ఈ క్యాంటీన్లు మూత పడ్డాయి. పేదల నోటి దగ్గర కూడు తీసేశారంటూ టీడీపీ రచ్చ చేసింది. ఈ ఎన్నికల్లో కూటమి గెలిచాక మళ్లీ ఆ క్యాంటీన్లు తెరుచు కుంటు న్నాయి. గతంలో ఉన్న క్యాంటీన్లను పునరుద్ధరి స్తున్నారు. ఆగస్ట్ 15 గడువు పెట్టుకుని క్యాంటీన్ల ప్రారంభోత్సవాలకు ఏర్పాట్లు జరుగు తున్నాయి. తొలి దశలో రాష్ట్రం మొత్తం 183 అన్న క్యాంటీన్లను ప్రారంభించడానికి ఏర్పాట్లు జరుగు తున్నాయి. వీటి పునరుద్ధరణకు రూ. 20 కోట్ల రూపాయలు ఖర్చు అవుతాయని అంచనా. క్యాంటీన్లలో ఐవోటీ పరికరాలు, సాఫ్ట్‌వేర్ అప్లికేషన్ కోసం రూ.7 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. 20 చోట్ల కొత్త క్యాంటీన్లను నిర్మించ బోతున్నారు. కొత్త క్యాంటీన్ల తోపాటు పెండింగ్ బిల్లుల చెల్లింపుల కోసం మరో రూ. 65 కోట్లను ప్రభుత్వం అదనంగా విడుదల చేయబోతోంది. క్యాంటీన్లకు ఆహారం సరఫరా చేసే సంస్థల కోసం ఇప్పటికే టెండర్లను పిలిచారు. ఈ నెలాఖరులోగా టెండర్లను ఖరారు చేసి దేశ స్వాతంత్ర్య దినోత్సవం ఆగస్ట్ 15 న లాంఛనంగా కొన్ని క్యాంటీన్లను ప్రభుత్వం ప్రారంభించ బోతోంది. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా డొక్కా సీతమ్మ పేరుతో క్యాంటీన్లను ఉండాలని ప్రతిపాదించారు. కానీ ఈ విషయంలో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయాన్ని ఇంకా తీసుకోలేదు.

# ఉచిత ఇసుక హామీ నిలుపుకున్న ఎన్డీఏ ప్రభుత్వం

**తెదేపా రాష్ట్ర కార్యదర్శులు తనకాల నాగేశ్వరరావు.. భవన రంగ కార్మిక కుటుంబాల్లో వెలుగులు -గంగిశెట్టి.**



**కోరుకొండ, విశ్వంవాయిస్ న్యూస్:** ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఎన్డీఏ అధినేత రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలలో భాగంగా 43 జీవో ద్వారా ఉచిత ఇసుక విధానంతో ఎన్నికల్లో వచ్చిన హామీని నిలబెట్టు కున్నారని తెదేపా రాష్ట్ర కార్యదర్శులు తనకాల నాగేశ్వరరావు కంటే నాగకేశవరావు గంగిశెట్టి చంటి బాబు ఎన్డీఏ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. బుధవారం బూరుగుపూడి గేటు వద్ద ఉన్న తెదేపా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడి ఒక మాసం లోపు యువతకు మెగా డీఎస్సీ, భూ హక్కు చట్టం రద్దు, పెన్షన్ల పెంపు, అన్న క్యాంటీన్లు పునః ప్రారంభం, యువతకు నైపుణ్య అభివృద్ధి పెంపు వంటి చర్యలతో పాటు ఉచిత ఇసుక విధానానికి నాంది పలకడంతో రాష్ట్రం అభివృద్ధి పదంలో పరుగులు పెట్టడంతో పాటు భవన రంగ కార్మికుల కుటుంబాల్లో వెలుగుల సంతరించుకున్నాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఒక్క ఇసుక కే సుమారు మూడు లక్షల రూపాయలు వెచ్చించవలసి వచ్చేదని, నేడు అది పది రెట్లు తగ్గడంతో బడుగు బలహీన వర్గాలు ఇంటి నిర్మాణానికి ముందుకు వస్తారని దీంతో పేదోడి సొంతింటి కల నెరవేరుతుంద న్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇసుక విక్రయాలు చేసిన జేపీ వెంచర్స్ ఇవ్వాల్సిన 800 కోట్లు బకాయిలు ప్రభు త్వం తక్షణమే రాబట్టాలన్నారు. ఈ సంద ర్భంగా నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి, ఎన్డీఏ విజయానికి సహకరించిన యావన్మంది ప్రజానీకానికి హృదయపూర్వక కృతజ్ఞ తలు తెలియ జేశారు. ఎన్డీఏ ప్రభుత్వం సుప్రీం, హైకోర్టుల ఆదేశాల మేరకు పర్యావరణ పరిరక్షణతో పాటు జిల్లా కమిటీల పర్యవేక్షణలో ఉచిత ఇసుక విక్ర యాలు జరుగుతాయన్నారు.ఈ కార్యక్ర మంలో అడపా వీరబాబు, బుడ్డిగా సత్య నారాయణ, మాదబోయిన అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ స్థాయి నాయకులు దొరబాబును విమర్శించడం తగదు



**అల్లవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** ఎన్. డి. ఎ కూటమి విజయానికి కృషి చేసిన డా. బి. ఆర్ అంబేద్కర్ కొనసీమ జిల్లా బీజేపీ అధ్యక్షులు యాళ్ల దొరబాబుపై కొందరు చేసిన విమ ర్శలను బెండమూర్లంక గ్రామ స్థాయి కూటమి నాయకులు బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో తీవ్రంగా ఖండించారు. మాజీ టీడీపీ బెండమూర్లంక గ్రామ కమిటీ అధ్యక్షులు గుర్రం నాగేశ్వరావు మాట్లాడుతూ బెండమూర్లంక గ్రామ అభివృద్ధికి నిత్యం కృషిచేస్తూన్న దొరబాబును విమర్శించడం తగదని అన్నారు. గ్రామంలో ఎ ఒకరో ఇద్దరో కూటమి విజయానికి కృషి చేయలేదని కూటమి టీడీపీ జనసేన బీజేపీ నాయకులు కార్యకర్తలు దొరబాబు ఆధ్వర్యంలో కృషి చేశారని టీడీపీ సీనియర్ నాయకులు కుప్పాల సత్తిబాబు అన్నారు. గ్రామంలో వాళ్ళ స్థాయి తగ్గిపోతుందానే అపోహతోనే దొరబాబుపై విమర్శలు చేస్తూ పబ్బం గడుపుకోవడానికేనని చేస్తున్నారని జనసేన సీనియర్ నాయకులు కుప్పాల లక్ష్మి రమణ అన్నారు.

జిల్లాలో కూటమి అభ్యర్థుల విజయానికి, గ్రామ అభివృద్ధికి పాటుబడిన దొరబాబుపై విమర్శలు చేయడం హాస్యాస్పదామని, దొరబాబును విమర్శించే స్థాయి కాదని, విమర్శించే ముందు నిరూపించాలని బీజేపీ గ్రామాకమిటి అధ్యక్షులు లింగం చిన్ని హెచ్చరించారు. దొరబాబుపై విమర్శలు చేసి మీ స్థాయిని దిగజార్చుకోవద్దని బీజేపీ నాయకులు గుర్రం బాబ్జి హితవు పలికారు. ఈ సమావేశంలో యాళ్ల వెంకటేశ్వరరావు (అబ్బులు), యాళ్ల బుజ్జి గిడుగు భాస్కరరావు, గుర్లింక కొండా, మేకల చంటి, నంద్యాల గణేష్, సిరిగినిడి ప్రసాద్, దేశినిడి ఉమా, కుప్పాల గణేష్, యర్రంశెట్టి సతీష్, కొల్లాటి నాగేంద్ర, అడబాల రాజా, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక సంస్కృతికి మూలం
## భారతీయ నృత్యం

**మాజీ ఎమ్మెల్సీ ఎన్ రామచందర్‌రావు**



**హైదరాబాద్, విశ్వంవాయిస్ న్యూస్ :** భారతీయ నృత్యాలు అనాదిగా వస్తున్న పరంపర అని,శాస్త్రీయ నృత్యాలు జాతి మహోనీయ మహర్షుల వరాలని అన్నారు.విదేశీయులు కూడా మన సంస్కృతి పట్ల ఆకర్షితులు అవుతున్నారని ,విదేశాల్లో తాను సందర్శించడం జరిగినప్పుడు మన కళ ల పట్ల వారి కున్న గౌరవాన్ని అనేక చోట్ల గమనించానని ఎన్ రామచందర్ రావు అన్నారు. నల్లకుంట శ్రీ శృంగేరి శంకర్ మఠం సౌజన్యంతో శ్రీ ఆకాంక్ష చారిటబుల్ ట్రస్ట్,శ్రీ వాణి నృత్య నికేతన్ నంది కళ క్షేత్ర సంయుక్త ఆధ్వర్యంలో భారతీయ కూచిపూడి నృత్య ప్రదర్శన కార్యక్రమం ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు.నందిని నంది నృత్యలను అద్భుతంగా నర్తించి ప్రశంసలు అందుకున్నారు.రమా వాణి ఆధ్వర్యంలో ఆమె శిష్యురాళ్లు చక్కగా అభినయించి, పలు నృత్యలను కన్నుల పండువగా ప్రదర్శించారు.శ్రీ శృంగేరి శంకర్ మఠం కార్యనిర్వహణా అధికారి కృష్ణారావు సౌజన్యంతో జరిగిన కార్యక్రమములో ఎన్.రామచందర్ రావు ముఖ్య అతిథిగా విచ్చేయగా, ప్రముఖ కవి రఘుశ్రీ సభాధ్యక్షత వహించిన కార్యక్రమం లో ఆత్మీయ అతిథిగా కర్ణాటక బ్యాంక్ మేనేజర్ మాడుగుల గురునాథ్ శర్మ , యూరో కిడ్స్ ప్రిన్సిపాల్ ప్రసన్న,రత్నమాల, పాల్గొని కళాకారులకు జ్ఞాపికలు,ప్రశంసా పత్రాలు అందచేశారు.సంస్థ అధ్యక్షురాలు పాలపర్తి సంధ్యారాణి వందన సమర్పణ చేశారు.

కోనసీమ రైల్వేప్రోజెక్ట్
## త్వరితగతిన పూర్తవుతుంది

**అమలాపురం పార్లమెంటు సభ్యులు హరిష్ మాధుర్**



**అమలాపురంటౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** అమలాపురం పార్లమెంటు సభ్యులు హరిష్ మాధుర్ ను క్యాంప్ ఆఫీస్ లో కోనసీమ జేఏసీ కార్యవర్గం మర్యాద పూర్వకంగా కలిసి అభినందించింది. ఈ సందర్భంగా ఆయిన మాట్లాడుతూ తన తండ్రి ఆశయం మేరకు కోటిపల్లి - నర్సాపురం రైల్వేలైన్ పూర్తిచేయించడమే తన లక్ష్యం అని అన్నారు.ప్రస్తుతం జరుగుచున్న రైల్వేబ్రిడ్జల నిర్మాణపు పనులు మరింత వేగవంతంగా జరుగడానికి కృషి చేస్తానని తెలిపారు. భూసేకరణ నత్తనడకన జరుగుచున్న కారణంగా ప్రాజెక్ట్ నిర్మాణపు పనులు ముందుకు సాగడం లేదనే అంశాన్ని ఆయిన దృష్టికి జేఏసీ కార్యవర్గం తీసుకెళ్ళింది.ఆయిన సానుకూలంగా స్పందిస్తూ సంబంధిత అధికారులు తో మాట్లాడుతాను అని హామీ ఇచ్చారు.జేఏసీ కన్వీనర్ బండారు రామమోహన్ రావు ఆధ్వర్యం లో జరిగిన ఈ భేటీ లో కో కన్వీనర్లు ఇళ్ల భక్తవత్సలం,మంత్రప్రగడ వేణుగోపాల్,సభ్యులు డా.మధుర నరసింహ మూర్తి, డా.రాయుడు శ్రీరామ మూర్తి,అన్యము రాంబాబు,రంకిరెడ్డి కాశీ,ఎస్. సొమ్మన్, నంద్యాల నాయుడు, పమ్మి నాగేశ్వరావు, టి.సుందర రామయ్య, మాచిరాజు నాగేశ్వరావు,ముత్యాల శరత్ బాబు, బాదం సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## స్టూడెంట్ కిట్స్ పంపిణి

**సీతానగరం మండలంలో పలు పాఠశాలల్లో ఉన్న విద్యార్థులకు యూనిఫారం, బెల్ట్, షూస్, స్కూల్ బ్యాగ్స్‌తో కూడిన స్టూడెంట్ కిట్స్ పంపిణి చేసిన బత్తుల**




**సీతానగరం, విశ్వంవాయిస్ న్యూస్ :** తూర్పు గోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గం లోని సీతానగరం మండలం రాజంపేట వెదురుపల్లి,సీతానగరం, రఘుదేవ పురం గ్రామాల్లో ఉన్న పాఠశాలలో నిర్వహించిన స్టూడెంట్ కిట్ల పంపిణీ కార్యక్రమంలో జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు కమిటీ కో-ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి పాల్గొని విద్యార్థులకు కిట్ల ను పంపిణీ చేశారు. అనంతరం రఘుదేవ పురం గ్రామంలో ఎన్డీయే కూటమి నాయకులతో కలిసి పర్యావరణాన్ని పరిరక్షించడానికి బత్తుల వెంకటలక్ష్మి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వారి వెంట స్థానిక జనసేన, తెలుగుదేశం, బిజెపి నాయకులు , కార్యకర్తలు, వీరమహిళలు తదితరులు పాల్గొన్నారు.

## రెండు గ్రామాల్లో ఖరీఫ్ పంటకు విరామం

**రొయ్య చెరువుల్లోని స్లజ్ ని డ్రెయిన్లోకి తోడేస్తున్నారని రైతులు ఆందోళన**

**డ్రెయిన్లో వల కట్లు తొలగించకపోతే వ్యవసాయం చేయలేమని రైతులు ప్రకటన**



**అల్లవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రొయ్యల చెరువుల్లోని ఆక్వా వ్యర్థాల (స్లజ్) మురుగునీరు దిగే మురుగు బోదెలు, రెవెన్యూ డ్రెయిన్లోకి ఆక్వా రైతులు యంత్రాల సహాయంతో తోడేస్తున్నారని, దీంతో మురుగుబోదెలు మూసుకుపోయి పల్లపు ప్రాంతాల్లోని వరి పోలాలను ముంపు బారిన పడి వరి పండించే రైతులు తీవ్రంగా నష్టపోతున్నామని అల్లవరం, రెల్లుగడ్డ గ్రామానికి చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అల్లవరంలోని రైతు నాయకులు బొక్కా శ్రీను ఆధ్వర్యంలో బుధవారం ఆయన నివాసంలో రెండు గ్రామాలకు చెందిన రైతులు సమావేశమై రెల్లుగడ్డ,అల్లవరం రెవెన్యూ గ్రామాల్లోని ముంపు ప్రాంతాల్లో ఖరీఫ్ పంటకు విరామం ప్రకటించారు.

## బత్తుల చేతుల మీదుగా విద్యార్థులకు "విద్య కిట్లు" పంపిణీ

**విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి**



**కోరుకొండ, విశ్వంవాయిస్ న్యూస్ :** ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పాటు అనంతరం విద్యాలయాలు పునః ప్రారంభం కావడంతో రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ ఎన్డీఏ నాయకులు ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యా కిట్లు ఘనంగా పంపిణీ చేశారు. బుధవారం రాజానగరం నియోజకవర్గంలోని మూడు మండలాల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు విద్యా కిట్లు పంపిణీకి తెదేపా, జనసేన, భాజపా నాయకులు పెద్ద ఎత్తున రావడంతో పాఠశాలలు జనసంద్రంగా మారాయి. ఎన్డీఏ నాయకులు చేతుల మీదుగా స్కూల్ బ్యాగులు, షూస్, టై తో పాటు పాఠ్య పుస్తకాలు పెద్ద ఎత్తున పంపిణీ చేశారు. రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ చేతుల మీదుగా రాజానగరం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నతపాఠశాలలో విద్యార్థులకు కిట్లు అందజేశారు. అన్ని గ్రామాల్లోని పాఠశాలలో ఎన్డీఏ నాయకులు చేతుల మీదుగా కిట్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా శాసనసభ్యులు బత్తుల విద్యార్థులకు అభినందనలు తెలియజేస్తూ చదువులలో చక్కగా రాణించి గ్రామానికి తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ నాయకులు,ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఏరియా ఆసుపత్రిని పరిశీలించినా పోలిశెట్టి



**రామచంద్రపురం, విశ్వంవాయిస్ న్యూస్ :** రామచంద్ర పురం ఎమ్మెల్యే, కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదేశాలు మేరకు రామచంద్రపురం నియోజవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్ స్థానిక ఏరియా ఆసుపత్రి ని ఆకస్మిక తనిఖీ చేసారు. ఈసందర్బంగా ఆసుపత్రి నందు కొత్తగా నిర్మించిన పై అంతస్తు నిర్మాణం పనులను పరిశీలించారు. అనంతరం రోగులకు అందుతున్న వైద్య సేవలను,అడిగి తెలుసుకొన్నారు. అలాగే రోగులకు అందిస్తున్న ఆహార పదార్థాలను పరిశీలించడం జరిగింది.

## అంగన్వాడి ఫ్రీ స్కూల్ గ్రాడ్యుయేషన్ డే కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి




**కొవ్వూరు, విశ్వంవాయిస్ న్యూస్ :** కొవ్వూరు మున్సిపల్ ఆఫీసులో డి మమ్మీ ఆధ్వర్యంలో అంగనవాడి ఫ్రీ స్కూల్ గ్రాడ్యుయేషన్ డే లో పాల్గొన్న కొవ్వూరు శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు, మున్సిపల్ చైర్ పర్సన్ భావనరత్న కుమారి మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ సూరపనేని చిన్ని మరియు కొవ్వూరు టౌన్ అంగన్వాడి టీచర్స్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కార్మికులకు ఉద్యోగ భద్రత,ఓల్డ్ పెన్షన్ స్కీం అమలు చేయాలి

**డిమాండ్స్ డే సందర్భంగా కార్మికుల డిమాండ్స్ పరిష్కరించాలని తహాశీల్దార్ కు అంగన్వాడీలు వినతిపత్రం**




**కొత్తపేట/ ఆత్రేయపురం విశ్వంవాయిస్ న్యూస్ :** సి.ఐ.టి.యు అధ్వర్యంలో దేశవ్యాప్త డిమాండ్స్ డే పిలుపులో భాగంగ కొత్తపేట నియోజకవర్గంలో గల నాలుగు మండలాలలో ధర్నా కార్యక్రమం చేయడం జరిగింది. కేంద్రంలో,రాష్ట్రంలో గత ప్రభుత్వాలు కార్మికులకు వ్యతిరేకంగా,కార్పోరేట్లకు అనుకులంగా పనిచేసాయి. అంగన్వాడి,ఆశా,మధ్యహ్నభోజన పథకం,నేషనల్ హెల్త్ మిషన్,వెలుగు,ఉపాధి హామీ, మెప్మా,సమగ్ర శిక్ష,ఆయూష్ కేంద్రియ వ్యవసాయం,108, 104 తదితర అన్ని పథకాల కార్మికులను ప్రభుత్వ కార్మికులుగా గుర్తించగపోగ కనీస వేతనాలు చెల్లించలేదని, భవన నిర్మాణకార్మికుల సంక్షేమపథకాలను నిలిపివేసింది అని కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్,కంటింజెంట్, పార్టైం,గెస్ట్ తదితర కార్మికులకు ఉద్యోగ భద్రత లేదని, ఓల్డ్ పెన్షన్ స్కీం అమలు చేయకపోగా నూతన పెన్షన్ స్కీం తీసుకుని వచ్చింది. విశాఖస్టిల్ ప్లాంట్ను ప్రయివేటికరణ చేయుటకు మొగ్గచుపుతున్నది. ట్రాన్స్పోర్టు కార్మికులకు కంద, కొబ్బరి వోలుపు దింపు,కార్మికులకు ఎటువంటి సంక్షేమ బోర్డులు తీసుకుని రాలేదు.నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం మా యొక్క డిమాండ్స్ని పరిష్కరించాలి అని ప్రభుత్వ దృష్టికి తీసుకుని వస్తున్నాము.వెంటనే మా సమస్యలను పరిష్కరించాలి అని డిమాండ్ చేస్తున్నాము అన్నారు. దేశ వ్యాప్త కార్మికుల డిమాండ్స్ పరిష్కరించాలి అని వినతిపత్రం. 1.లేబర్ కోడ్సు వెంటనే రద్దు చేయాలి. 2.ప్రైవేటీ కరణను, జాతీయ అమలుకు నగదు బదిలీ కరణ పథకములను ఆపాలి. 3.అంగన్వాడి, ఆశా, మధ్యహ్నభోజన పథకం, నేషనల్ హెల్త్ మిషన్, వెలుగు, ఉపాధి హామి, మెప్మా, సమగ్ర శిక్ష, అయూష్, శేంద్రియ వ్యవసాయం, 108, 104 తదితర అన్నిపథకాల కార్మికులను ప్రభుత్వ కార్మికులుగా గుర్తించాలి. 4. కనీస వేతనాలు నెలకు రూ. 26000 చొప్పున నిర్ణయించి అమలు చేయాలి. పెన్షన్ లాంటి సామాజిక భద్రతా సౌకర్యాలు కల్పించాలి. 5. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను తిరిగి ప్రారంభించాలి,ఇప్పటివరకు పెండింగ్ ఉన్న పెండింగ్ క్లయిముల పరిహారాలను తక్షణమే చెల్లించాలి. 6. కాంట్రాక్ట్,ఔట్సోర్సింగ్, కంటింజెంట్,పార్టైం,గెస్ట్ తదితర కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి.కాంట్రాక్టరును తొలగించినా కార్మికులకు తొలగించరాదు.అందరికీ సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి.రెగ్యులర్ చెయ్యాలి. 7.పాత పెన్షన్ స్కీమును అమలు చేయాలి. నూతన పెన్షన్ స్కీమును రద్దు చేయాలి. 8.విశాఖ స్టీల్ ప్లాంట్ను పూర్తి సామర్ధ్యంతో నడపాలి.విశాఖ స్టీల్ ప్లాంట్ రక్షణకు కేంద్ర ప్రభుత్వ చర్యలు చేపట్టాలి. 9.ట్రాన్స్ పోర్ట్ కార్మికులకు ఉరితాడుగా మారనున్న భారత న్యాయ సంహిత చట్టాన్ని రద్దు చేయలి. 10. కంద,కొబ్బరి వలపు దింపు,ట్రాన్స్పోర్ట్ మరియు ఇతర అసంఘటిత కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయ్యాలి అని డిమాండ్ చేశారు.

## మెరుగైన వైద్యం కోసం కృషి చేస్తున్నాం

**ప్రతి సమస్య తెలుసుకుంటున్నాం... పరిష్కరిస్తాం.. సౌకర్యాల కల్పననకు కృషి**

**ఆరోగ్యకరమైన రాజమండ్రి మా ధ్యేయం.. ప్రభుత్వాసుపత్రి సందర్శనలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**

**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** జిల్లా ప్రభుత్వాసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు తాము కృషి చేస్తున్నామని, అందు కోసమే ప్రతి 15 రోజులకు ఒకసారి ఆసుపత్రిని పరిశీలిస్తున్నామని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమండ్రి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో మంచి వైద్యం అందుతుందని ప్రజలకు చాలా నమ్మకం ఉందని వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఆసుపత్రిలో నెలకొన్న చిన్నపాటి లోపాలను సరి చేసి రోగులకు మెరుగైన వైద్యం అందేలా చూస్తామన్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి ఆసుపత్రిలో పర్యటించి రోగుల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఇచ్చిన మాట ప్రకారం బుధవారం ఆయన జనసేన పార్టీ రాజమండ్రి అధ్యక్షులు వై శ్రీను, కూటమి నాయకులులతో కలిసి పరిశీలించారు. మాజీ ఎంపీ మాగంటి మురళి మోహన్ కూడా కొద్ది సేపు అక్కడ ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ వివిధ ఆనారోగ్యాలతో వచ్చిన వారిని పలుకరించి వారి సమస్యలు తెలుసుకుని సంబంధిత వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఇక్కడ కొంతమంది వైద్యులు తమ బాధను పట్టించుకోకుండా ఇష్టానుశారంగా మాట్లాడుతున్నారని కొందరు చేసిన ఫిర్యాదుల పట్ల స్పందించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సదరు వైద్యులను పిలిచి సున్నితంగా మందలించారు. మీ మాటలతో సగం రోగం నయం అవుతుందని, మీరే వారు బాధపడేలా మాట్లాడి వారి బాధ ఇంకెవరికి చెబుతారని, తీరుమార్చుకోవాలని వైద్యులకు సూచించారు. ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకువచ్చేలా ప్రవర్తిస్తే మాత్రం సహించేది లేదని హెచ్చరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇక్కడ కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందుతుందని ప్రజలు విశ్వసిస్తారని అన్నారు. దాని అనుగుణంగానే రాజమండ్రి చుట్టు పక్కల ప్రాంతాల నుంచి నిత్యం వేల సంఖ్యలో వైద్యం కోసం ఈ ఆసుపత్రికి వస్తుంటారని అన్నారు. అయితే కొన్ని జాప్యాలు



ఉన్నాయన్నారు. తాము చేసిన పరిశీలనలో కనిపించిన ఆ జాప్యాలను సూపరింటెండెంట్ దృష్టిలో ఉంచామన్నారు. ఓపీ విషయంలో సర్వర్ లోపం కారణంగా కొద్దిగా జాప్యం జరుగుతోందని దానిని కూడా సరి చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. సర్వర్ పని చేయని పక్షంలో మాన్యువల్గా ఓపీ ఇస్తున్నారన్నారు. ఆసుపత్రి ఆవరణలో జరుగుతున్న నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసి వాటిని అందుబాటులోకి తీసుకువచ్చేలా చూస్తామన్నారు.

**ప్రతి 15 రోజులకు ఒకసారి ఆసుపత్రిని తనిఖీ చేస్తాం :** తాము ఇక్కడితో ఆగకుండా ప్రతి 15 రోజులకు ఒకసారి ఆసుపత్రిని తనిఖీ చేస్తామన్నారు. రోగులకు అందుతున్న వైద్యం విషయంలో వారినే సమస్యలు అడిగి తెలుసుకుంటామన్నారు. వైద్యులు అందిస్తున్న వైద్యం తీరు, మందులు ఇతర సౌకర్యాల పట్ల ప్రజలు చెప్పిన దానిపై తమ పరిధిలో జరిగితే వెంటనే పరిష్కరిస్తామని, లేదా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ఆ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. ఆరోగ్యకర రాజమండ్రిలో భాగంగా మొదటి అడుగుగా నగరంలోని డ్రైనేజీ వ్యవస్థను ప్రక్షాళన చేస్తున్నామన్నారు. ఆరోగ్యకరమైన రాజమహేంద్రవరం కోసం తాము కృషి చేస్తున్నామన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు ఆయన వెంట ఉన్నారు.

## ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలి

**లేబర్ కోడ్స్ రద్దు చేయాలి.. కనీస వేతనం 26 వేలు అమలు చేయాలి : సిఐటియు**




**కొండపల్లి, విశ్వంవాయిస్ న్యూస్ :** ఆల్ ఇండియా డిమాండ్స్ డే సందర్భంగా కొండపల్లి ఐడిఏ హెచ్ పి గ్యాస్ ప్లాంట్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం కొండపల్లి. ఆల్ ఇండియా డిమాండ్స్ డే జులై 10న ఆల్ ఇండియా సిఐటియు కమిటీ పిలుపు మేరకు కొండపల్లి హెచ్ పి గ్యాస్ ప్లాంట్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు మండల కార్యదర్శి యం మహేష్ మాట్లాడుతూ లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, కనీస వేతనం 26 వేలు కాంట్రాక్టు కార్మికులకు అమలు చేయాలని, ముఠా వర్కర్స్ కీ , లారీ , ఆటో డ్రైవర్స్ కి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, బిల్డింగ్ కార్మికులకు రాష్ట్ర సంక్షేమ బోర్డు తిరిగి ప్రారంభించాలని, అంగన్వాడీ ఆశా మధ్యాహ్న భోజన పథకం స్కీం వర్కర్లను పర్మినెంట్ చేయాలని,కనీస వేతనం అమలు చేయాలని తదితర డిమాండ్స్ తో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు సూరి బాబు, బాలకృష్ణ, ఎలియారాజ్ , బాబు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం వార్షికోత్సవంలో ముప్పిడి, సూరపనేని



**కొవ్వూరు, విశ్వంవాయిస్ న్యూస్ :** కొవ్వూరు వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం యొక్క వార్షిక సమావేశంలో కొవ్వూరు నియోజకవర్గం శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు, కొవ్వూరు పట్టణ మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ సూరపనేని చిన్ని తెలుగుదేశం పార్టీ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## పోలవరం నిర్వాసితులకు పట్టిసీమ తరహా పరిహారం చెల్లించాలి



**చింతూరు, విశ్వంవాయిస్ న్యూస్ :** పోలవరం ఇందిరా సాగర్ ప్రాజెక్ట్ వల్ల సర్వం కోల్పోతున్న నిర్వాసితులకు పరిహారం పట్టిసీమ ప్రాజెక్టు నిర్వాసితులకు ఇచ్చిన విధంగా చెల్లించాలని సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్ డిమాండ్ చేశారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో సోమవారం జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో సురేష్ మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులకు పునరావాసం, పరిహారం చెల్లించడంలో ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్నాయని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు ప్రారంభమైన ఈ 20 ఏళ్ల నుండి ప్రభుత్వాలు ప్రాజెక్టు నిర్మాణాన్ని త్వరతగతిన పూర్తి చేస్తామంటూ చెబుతున్నాయి తప్పా సర్వం కోల్పోతున్న నిర్వాసితులకు పరిహారం, పునరావాసం పట్ల శ్రద్ధ పెట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి పట్టిసీమ నిర్వాసితులకు పరిహారం ఎకరాకు ఆనాడు రూ.20 లక్షలు చెల్లించారని గుర్తు చేశారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారంగా పోలవరం నిర్వాసితులకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. పునరావాస కాలనీలకు నిర్వాసితులు తరలించే నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులందరికీ ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. పోలవరం నిర్వాసితులకు పరిహారంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి కేంద్ర ప్రభుత్వం నుండి నిధులు తీసుకువచ్చి నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా నాయకులు పల్లపు వెంకట్, మండల నాయకులు పోడియం లక్ష్మణ్, కారం సుబ్బారావు, సవలం నారాయణ, బాడిస శేషు, దిలీప్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## బురద నీరు తాగేది ఎలా..?



**అనంతగిరి, విశ్వంవాయిస్ న్యూస్ :** గ్రామంలో ఏర్పాటు చేసిన మోటారు బోరు కనెక్షన్ మరమ్మతుకు గురైందని, దీంతో కురుస్తున్న వర్షాల కారణంగా ఊట గెడ్డలో బురద నీరే దిక్కుగా మారిందని వెంగడ పంచాయతీ మెటువలస గ్రామాల గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని గ్రామస్తులు మండల సిపిఎం నాయకులు దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం గ్రామాలను సందర్శించిన నాయకులు పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ, గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఊట పైపులైన్ నుంచి బురద నీరు సరఫరా అవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు కొండలరావు, రామన్నలు మాట్లాడుతూ, గ్రామంలో సంవత్సరం క్రితం ఏర్పాటు చేసిన బోరు మోటార్ కనెక్షన్ మరమ్మతు గురైందని, ఊట బావి నుండి తాగునీటి సరపరా అవుతుందన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షా లతో కలుషితమైన బురద వస్తుందని, దీంతో రోగాలకు గురవు తున్నామన్నారు. అధికారులు స్పందించి మోటార్ కనెక్షన్ పనులు చేపట్టి తాగునీటి సరఫరా చేయాలని గ్రామస్తులు కోరారు.

## ఎన్నికల సెక్టార్ అధికారులతో ఆర్డిఓ సమీక్ష





నందిగామ : నందిగామ అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి నందిగామ రెవెన్యూ డివిజనల్ అధికారి ఎ.రవీంద్రరావు కెవిఆర్ కాలేజ్లో సోమవారం ఎన్నికల విధి నిర్వహణ గురించి సెక్టార్ రూట్ అధికారులకు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సెక్టార్, రూట్ అధికారులు చేయబోయే కర్తవ్యాలు, మాక్ పోల్ గురించి, పిఒ డైరీ గురించి, ఇవిఎంల గురించి వివరించారు. రూట్ అధికారులు వారికి కేటాయించిన రూట్లను జాగ్రత్తగా చూసుకొని విధిగా పాటించాలని తెలిపారు. పిఎల విధుల గురించి కూడా వివరించారు. చివరగా అందరూ సెక్టార్ , రూట్ అధికారులతో ఎలక్ట్రానిక్ వోటింగ్ మెషిన్ గురించి పూర్తి అవగాహనా కల్పించారు. పోలింగ్ రోజున చాలా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ సమావేశం లో నందిగామ తహశీల్దార్ వై.సరస్వతి, తహశీల్దార్ వి.సుస్వాగతం, వీరులపాడు తహశీల్దార్ కె.రాజ కిషోర్, చందర్లపాడు తహశీల్దార్ జీ.మురళీధర్, అసెంబ్లీ స్థాయి సెక్టార్ అధికారులు, రూట్ ఆఫీసర్స్ పాల్గొన్నారు.

# కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని
# పలుచోట్ల కార్మికుల నిరసనలు



**విజయవాడ, విశ్వంవాయిస్ న్యూస్ :** కార్మికుల డిమాండ్స్ 'డే' సందర్భంగా జిల్లాలో పలుచోట్ల నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం సిఐటియు సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో విజయవాడ లెనిన్ సెంటర్‌లో పెద్ద ఎత్తున కార్మికుల డిమాండ్స్‌పై ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కార్మికులు అనేక సమస్యలతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారని కార్మికులకు అండగా ఉండే కార్మిక చట్టాలను యాజమాన్యాలకు అనుకూలంగా కేంద్రంలో బి.జె.పి ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్స్‌ను తీసుకురావడం దుర్మార్గమని అన్నారు. కార్పొరేట్ కంపెనీలకు కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అండగా నిలుస్తుందని, తద్వారా కార్మికులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఆటో, ముఠా,బిల్డింగ్, షాపు, హెూటల్, చిరు వ్యాపారస్తులు అంగన్వాడీ, ఆశా, ఇతర రంగాల్లో స్కీం వర్కర్లు, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులు, ట్రాన్స్పోర్ట్ రంగంలో పనిచేస్తున్న కార్మికులు, ఇతర రంగాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల కార్మికుల సమస్యలను తక్షణమే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కారం చేయాలని ఈ సందర్భంగా ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, కార్మికులకు వ్యతిరేకంగా ఉన్న కార్మిక చట్టాలను ఉపసంహరించుకోవాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. కార్మిక సమస్యలను తక్షణమే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కారం చేయకపోతే రాబోవు కాలంలో పెద్ద ఎత్తున కార్మికుల్ని ఐక్యం చేసి అనేక ఉద్యమాలు నిర్వహిస్తామని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు ఏ.వెంకటేశ్వరరావు, సెంట్రల్ సిటీ అధ్యక్షులు కె.దుర్గారావు, మెడికల్ రిప్స్ రాష్ట్ర నాయకులు కృష్ణయ్య, జిల్లా నాయకులు శాస్త్రి, సిఐటియు సెంట్రల్ సిటీ నాయకులు ఎం.సీతారాములు, యం.బాబురావు, వై.సుబ్బారావు, టి.ప్రభుదాస్, సిహెచ్.మురళి, ఎం.హనుమంతరావు, ఎం.వి.రమణ, సుందర రామరాజు, పున్నారావు పాల్గొన్నారు. లెనిన్ సెంటరులో స్కీం వర్కర్ల ధర్నావిజయవాడ లెనిన్ సెంటరులో స్కీం వర్కర్లు ధర్నా నిర్వహించారు. స్కీం వర్కర్ల పట్ల కేంద్రం నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తోందని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎ.వి.నాగేశ్వరరావు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ, ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎన్‌సిహెచ్.సుప్రజ, గజలక్ష్మి, సిఐటియు విజయవాడ సెంట్రల్ సిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్సులు కె.దుర్గారావు, ఎం.వి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులోనూ నిరసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎ.వి.నాగేశ్వరరావు, ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షులు ఎ.వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి వెంకటేశ్వరావు, మెడికల్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యు.వి.కృష్ణయ్య, నాయకులు పి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట : పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్, స్థానిక తహసిల్దార్ కార్యాలయం, మండలంలోని బూదవాడ గ్రామంలో గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఆశ వర్కర్లు, పంచాయతీ వర్కర్లచే ఆందోళన చేపట్టారు. పట్టణంలో జరిగిన ఆందోళనలో ఆశ వర్కర్లు, ఐసిడిఎస్ కార్యకర్తలు, మధ్యాహ్న భోజనం ఏజెన్సీలు, మున్సిపల్ వర్కర్లు తదితర సంఘాలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్.శ్రీనివాస్ మాట్లాడుతూ పాత పింఛన్ స్కీమును అమలు చేయాలని, విశాఖ స్టీల్ ప్లాంట్ ను ప్రైవేటీకరణ ఉపసంహరించుకోవాలని, స్కీమ్ వర్కర్లకు ప్రత్యేక గుర్తింపుని ఇవ్వాలని తదితర డిమాండ్స్ వివరించారు.

విజయవాడ అర్బన్ : విజయవాడ ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఆశా వర్కర్స్ యూనియన్ నిరసన ధర్నా కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా శ్రామిక మహిళ నాయకురాలు ఎ.కమల మాట్లాడుతూ ఆశా వర్కర్లకు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుకరణ చేయొద్దని, డిమాండ్ చేస్తూ సిఐటియు గత పోరాటాల సాధించుకున్నారన్నారు. 44 రకాల చట్టాలని 4 లేబర్ కోడ్ కేంద్ర ప్రభుత్వం పెట్టడం చాలా దుర్మార్గమని లేబర్ కోడ్లు తక్షణమే రద్దు చేయాలని భవిష్యత్తులో ఐక్య కార్యచరణకి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల్ని కార్మిక హక్కులని చట్టాలని ఉల్లంఘిస్తే భవిష్యత్తు ఉద్యమాలకు పిలుపునిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విజయవాడ సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు విబి రాజు, ఎన్.కోటబాబు, నాయకురాలు శ్రీలక్ష్మి, దయామని, జోష్న తదితర ఆశ వర్కర్స్ కార్మికులు పాల్గొన్నారు.

మైలవరం : సిఐటియు కార్యాలయం నుండి పంచాయతీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. సిఐటియు మండల కార్యదర్శి సుధాకర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పి.జ్యోతి, సిఐటియు మండల అధ్యక్షురాలు ఆర్‌వి.పుష్పకుమారి, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ మండల ప్రధాన సిహెచ్.శారద, మధ్యాహ్నం భోజన కార్మిక సంఘం కార్యదర్శి శేషమ్మ, పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

వీరులపాడు : జుజ్జూరు గ్రామంలో గ్రామ సచివాలయం నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు ప్రదర్శనగా నిర్వహించారు. సిఐటియు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో పలు డిమాండ్లపై జుజ్జూరు రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

ఇబ్రహీంపట్నం : స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు డిమాండ్స్ డే సందర్భంగా స్కీం వర్కర్స్, అంగన్వాడీ, ఆశా వర్కర్లు మధ్యాహ్న భోజనం పథకం కార్మిక యూనియన్ సభ్యులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి ఎం.మహేష్ మాట్లాడారు. కొండపల్లి హెచ్‌పి గ్యాస్ ప్లాంట్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.

గంపలగూడెం : స్థానిక తహసిల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ ఆందోళనలో ఆశ వర్కర్లు, ఐసిడిఎస్ కార్యకర్తలు, మధ్యాహ్న భోజనం ఏజెన్సీలు, తదితర సంఘాలు పాల్గొన్నాయి. సిఐటియు మండల కార్యదర్శి వెంకటేశ్వరరావు మాట్లాడారు. అనంతరం వినతిపత్రాన్ని డిప్యూటీ తహశీల్దార్ రాధికారాణికి అందజేశారు. సిపిఎం మండల కార్యదర్శి గువ్వల సీతారామరెడ్డి, ఊటుకూరు కార్యదర్శి ఎన్.జె.చారి, వివిధ గ్రామాల వర్కర్లు పాల్గొన్నారు.

విసన్నపేట : స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం చేపట్టి అనంతరం అక్కడనుండి ర్యాలీగా అంబేద్కర్ సర్కిల్ వద్దకు తరలివెళ్లారు. సిఐటియు నాయకులు విస్సంపల్లి నాగరాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా నాయకులు మేకల జ్ఞాన రత్నం అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు, వీఆర్ఏ సంఘం నాయకులు పాల్గొన్నారు.

తిరువూరు : తిరువూరు బోసు బొమ్మ సెంటర్లో అంగన్వాడీ కార్యకర్తలు నిరసన తెలిపారు. సిఐటియు మండల కార్యదర్శి బి.వెంకటేశ్వర రావు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వత్సవాయి : కార్మికుల సమస్యలపై ఎంఎల్ఎ శ్రీరాం రాజగోపాల్ తాతయ్యకు సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు వినతిపత్రం అందజేశారు. సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బి.రాము మాట్లాడారు.

రెడ్డిగూడెం : అమర భవన్ నుంచి నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సిఐటియు ఆధ్వర్యంలో సిఐటియు మండల అధ్యక్షులు కొండపల్లి పరమేశ్వరరావు ,ఆశ వర్కర్స్, అంగన్వాడీ టీచర్స్, పాల్గొన్నారు. తహశీల్దారు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.



### కలెక్టర్‌ను కలిసిన
## ఆలూరు శాసనసభ్యులు

**చిప్పగిరి, విశ్వంవాయిస్ న్యూస్ :** జిల్లా కలెక్టర్ రంజిత్ భాషను బుధవారం ఆలూరు శాసనసభ్యులు భూసిన విరుపాక్షి మర్యాదపూర్వకంగా కలిసి బొకే ను అందజేశారు. వెనుకబడిన పశ్చిమ ప్రాంతమైన ఆలూరు నియోజకవర్గం అన్ని రంగాలలో చాలా వెనుకబడిందని ఆయన దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలూరు నియోజకవర్గం లో ఆరు మండలాలలో తాగునీటి సమస్య ఉన్న గ్రామాలు చాలా ఉన్నాయన్నారు. మండలాల లో దాదాపు అన్ని గ్రామాలలో పర్యటించానని, ప్రతి గ్రామంలో కూడా రోడ్లు, తాగునీటి సమస్యలు వెంటాడుతున్నాయన్నారు. ముఖ్యంగా సరైన పంటలు లేక వలస వెళ్లే గ్రామాలు చాలా ఎక్కువగా ఉన్నాయి అన్నారు. చిప్పగిరి దగ్గర ఉన్న హంద్రీనీవాకు అధికారికంగా ప్రత్యేక తూము ఏర్పాటు చేసి ఏబీసీ కాలువ ద్వారా సాగునీటిని అందించి చిప్పగిరి మండల ప్రజలను ఆదుకోవాలని కలెక్టరను కోరారు.

### కనీస వేతనాలు పెంచాలని రాజకీయ వేదిక
## తొలగించాలని నిరసన



**వెల్దుర్తి, విశ్వంవాయిస్ న్యూస్ :** బుధవారం డిమాండ్స్ డే సందర్భంగా పలు సంఘాలు కలిసి వెల్దుర్తి ఎమ్మార్వో వద్ద నిరసన చేశాయి. కనీస వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, లేబర్ కోర్స్ రద్దు చేయాలని, ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరణ చేయరాదని, అంగన్వాడీ ఆశ మధ్యాహ్న భోజన పథకం, 104, 108 వెలుగు, మెప్మా ఆయుష్ నేషనల్ హెల్త్ మిషన్ కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ఉద్యోగులందరికీ ఎస్ ఎస్ ఏ ఉద్యోగులకు సమ్మె కాలపు వేతనాలతోపాటు, పెరిగిన అరియర్స్ తక్షణమే చెల్లించాలని, రెన్యువల్స్ లేకుండా కొనసాగించాలని సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమానికి కర్నూలు జిల్లా కార్యదర్శి జే నాగేశ్వరరావు హాజరయ్యారు.

## రాష్ట్రాభివృద్ధికి ఉద్యోగుల భాగస్వామ్యం అవసరం



**విజయవాడ, విశ్వంవాయిస్ న్యూస్ :** కూటమి ప్రభుత్వ ఏర్పాటుకు ప్రజలు ఇచ్చిన తీర్పులో ఉద్యోగుల పాత్ర కీలకమని ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాల అమలులో ఉద్యోగుల సహకారం ఎంతో అవసరమని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. ఎంపి చిన్నిని మంగళవారం నగరంలోని గురునానక్ కాలనీలో గల ఆయన కార్యాలయంలో జిల్లా ఎన్జీవో సంఘ అధ్యక్షుడు, జేఏసీ చైర్మన్ ఏ.విద్యాసాగర్ ఆధ్వర్యంలో ఉద్యోగ సంఘ నాయకులు, ఉద్యోగులు మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ ఉద్యోగులు ఐదు సంవత్సరాలుగా ఎన్నో మానసిక, ఆర్థిక ఇబ్బందులు పడ్డారని, అనేక కేసులు ఎదుర్కొన్నారని అన్నారు. చిరు ఉద్యోగి నుండి ఉన్నత స్థాయి అధికారి వరకు కనీసం ఒకటో తేదీన జీతాలు పొందలేకపోయారన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో పెద్ద ఎత్తున ప్రజలను చైతన్య వంతులను చేసి అభివృద్ధి పథంలో నడిపించే ప్రభుత్వాన్ని ఎన్నుకోవడంలో ఉద్యోగులు కీలక పాత్ర వహించారన్నారు. ఉద్యోగులు ప్రజలు పెట్టుకున్న ఆశలకు అనుగుణంగా రాష్టాభివద్ధికి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి సూచనల మేరకు కేంద్ర ప్రభుత్వం నుండి అవసరమైన నిధులు మంజూరు చేయించి విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గాన్ని ఆదర్శ వంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దాలన్న తన ఆలోచనలను ఆచరణలో పెట్టడంలో ఉద్యుగుల సహకారం ఎంతో అవసరమన్నారు. విద్యాసాగర్ మాట్లాడుతూ గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిడమానూరు ఫ్లై ఓవర్, ఈస్ట్రన్ బైపాస్ నిర్మాణాలకు సంబంధించి ఎంతో కృషి చేశారన్నారు. విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గం అభివద్ధిలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్స్ పూర్తి సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉంటారని విద్యాసాగర్ తెలిపారు. తొలుత ఎంపిని ఉద్యోగ సంఘాల నాయకులు శాలువాతో సత్కరించారు. పార్లమెంటు సభ్యుడిని కలిసిన వారిలో ఎన్జీవో సంఘ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్, కార్యదర్శి డి.సత్యనారాయణ రెడ్డి, మాజీ కార్యదర్శి ఎండి ఇక్బాల్, జిల్లా నాయకులు బి.సతీష్ కుమార్, కె.శివలీల, ఎం.రాజబాబు, నగర శాఖ కార్యవర్గ సభ్యులు సిహెచ్.వి.ప్రసాద్, నజిరుద్దీన్, రాజశేఖర్, విజయశ్రీ, ప్రభుత్వ రంగ సంస్థల ఫెడరేషన్ చైర్మన్ ఏ.సాంబశివరావు, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు సాయిరాం, శ్రీనివాస్, పంచాయతీరాజ్ డిపార్ట్మెంట్‌కి చెందిన ఎం.శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## వాడివేడిగా జడ్పీ సర్వసభ్య సమావేశం

**అనంతపురం విశ్వంవాయిస్ న్యూస్ ::** ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం వాడివేడిగా కొనసాగింది. జడ్పీ చైర్ ఫర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన మంగళవారం జడ్పీ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఉమ్మడి జిల్లాల పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు, జిల్లా పరిషత్ సభ్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ముందుగా జడ్పీ చైర్ ఫర్సన్ బోయ గిరిజమ్మ ఉమ్మడి జిల్లాలో కొత్తగా ఎన్నికైన పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులకు పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. తొలుత ఎన్డీఏ కూటమిలో ఎన్నికైన ప్రజాప్రతినిధులు పింఛన్ల పెంపుపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలియజేశారు. పింఛన్ల పెంపును ఆమోదించాలని సభ్యులను కోరారు. ఈ విషయమే పలువురు వైఎస్ఆర్ సీపీ జడ్పిటిసి సభ్యులు కొన్ని పింఛన్లు తొలగించారని ఆరోపించారు. దానికి సత్యసాయి జిల్లా ఎంపీ బి.కె.పార్థసారథి ల మధ్య వాదోపవాదనలు చోటు చేసుకున్నాయి. వలంటీర్లతో పింఛన్లు పంపిణీ చేయలేదని పలువురు సభ్యులు ఆరోపించారు. వైఎస్ఆర్ పార్టీకి పనిచేసిన వలంటీర్లతో పనిచేయచ్చుకునే అవసరం తమకు లేదని కూటమి నాయకులు తెలిపారు. అర్హులందరికీ ఇంటింటికి పింఛన్లు పంచామని తాడిపత్రి ఎమ్మెల్యే జెసి అస్మిత్ రెడ్డి, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు




సమాధానం ఇచ్చారు. వైఎస్ఆర్సిపికి పని చేసిన వలంటీర్లతో తమ ప్రభుత్వ పథకాలను అందజేయబోమని స్పష్టం చేశారు. అనంతరం జడ్పీ సీఈవో, డిప్యూటీ సీఈవోల అవినీతి ఆరోపణలపై జడ్పీ చైర్పర్సన్ బోయ గిరిజమ్మ సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. విచారణ జరిపి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం పలువురు సభ్యులు ప్రజా ప్రతినిధులకు ప్రోటోకాల్ పాటించలేదని చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయమై రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు స్పందిస్తూ.. ప్రజలచే ఎన్నుకోబడిన ప్రజా ప్రతినిధులకు అధికారులు గౌరవం ఇవ్వాలన్నారు. ప్రోటోకాల్ పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వినోద్ కుమార్ ను కోరారు. విచారణ జరిపిస్తామని కలెక్టర్ తెలిపారు.

### అంగన్వాడీలపై
## వేధింపులు ఆపాలి



**పుట్లూరు, విశ్వంవాయిస్ న్యూస్ :** అంగన్వాడీలపై వేధింపులు ఆపాలని బుధవారం మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో తహల్దార్ మల్లికార్జున స్వామికి అంగన్వాడీ వర్కర్లు నతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్రంలో, రాష్ట్రంలో కొత్త ప్రభుత్వాలు అధికారం లోకి వచ్చాయి. గతంలో బీజేపీ ప్రభుత్వం అంగన్వాడీ లకు వేతనాలు పెంచుతాము, ఐసీడీఎస్ ను బలోపేతం చేస్తామన్న హామీలు నేటికీ నెరవేరలేదు. సుప్రీం కోర్టు అంగన్వాడీ లకు గ్రాట్యుటీ అమలు చేయమని ఇచ్చిన తీర్పును పక్కన పెట్టారు. వివిధ జిల్లాలలో కొన్ని ప్రాంతాలలో అధికార పార్టీ నాయకులు అంగన్వాడీలను బలవంతంగా రాజీనామాలు చేయాలని బెదిరిస్తున్నారు. సెంటర్లకు తాళాలు వేస్తున్నారు. హెల్పర్లు మానుకోవాలని ఒత్తిడి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జులై 10 అంగన్వాడీల కోరికల దినం పాటించాలని అఖిలభారత కమిటీ పిలుపులో భాగంగా మన రాష్ట్రంలో ఏర్పడిన కొత్త ప్రభుత్వం అంగన్వాడీల కోరికల దినోత్సవం సందర్భంగా 42 రోజులు సమ్మె కాలంలో ఇచ్చిన మినిట్స్ కాపీలోనే అంశాలు వెంటనే జీ. ఓలు ఇవ్వాలని ఈ క్రింది సమస్యలో పరిష్కారం చేయాలని కోరుతున్నాము అని అంగన్వాడీ నేతలు తెలిపారు.

### కార్మికుల డిమాండ్లు
## పరిష్కరించండి




**హొళగుంద, విశ్వంవాయిస్ న్యూస్ :** దేశవ్యాప్తంగా జులై 10 కోర్కెల దినోత్సవం సందర్భంగా సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి.. అనంతరం ఆర్ఐ దినోజ్ కుమార్ కి సిఐటియు నేతలు వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమన్నీ ఉద్దేశించి సీఐటీయూ మండల కార్యదర్శి నాగరాజు, సినియర్ నాయకులు వెంకటేష్ మాట్లాడుతూ.. కేంద్రంలో, రాష్ట్రంలో గత ప్రభుత్వాలు కార్మికులకు వ్యతిరేకంగా, కార్పొరేట్లకు అనుకూలంగా పనిచేశాయి. అంగన్వాడీ టీచర్ ఆశావర్కర్లు యూనియన్ నాయకులు లక్ష్మీ, సోలోమీ మాట్లాడుతూ కార్మిక హక్కులు సాధించడానికి 'డిమాండ్స్ డే' పరిష్కరం చెయ్యాలి. లేబర్ కోడ్ ను వెంటనే రద్దుచేయాలి. అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్నభోజన పథకం, నేషనల్ హెల్త్ మిషన్, సమగ్రశిక్ష, వెలుగు, మెప్మా, ఉపాధిహామి, నేకో, ఆయుష్, సేంద్రియ వ్యవసాయం, 108, 104 తదితర అన్ని పథకాల కార్మికులను ప్రభుత్వం కార్మికులుగా గుర్తించాలి. వారికి కనీస వేతనాలు చెల్లించాలి. కనీస వేతనం, పెన్షన్ లాంటి సామాజిక భద్రతా సౌకర్యాలు కల్పించాలి. కనీస వేతనాలు నెలకు రూ. 26 వేలు చొప్పున నిర్ణయించి అమలు చేయాలి. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున, వివిధ గ్రామల అంగన్ వాడీ టీచర్లు, ఆశావర్కర్లు, విఆర్ ఏలు, గ్రామ పంచాయితీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ ఉద్యోగులుగా
## అంగన్ వాడిలను గుర్తించాలి




**ఆస్పరి, విశ్వంవాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో ఉన్న అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సిఐటియు మండల కార్యదర్శి రామాంజనేయులు కోరారు. బుధవారం సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీ లు తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాల న్నారు. బిజెపి ప్రభుత్వం అంగన్వాడీలకు వేతనాలు పెంచి, ఐసిడిఎస్ ను బలోపేతం చేస్తామని హామీ ఇచ్చి నెరవేర్చడంలో విఫలం అయిందన్నారు. 42 రోజుల సమ్మెకాలంలో ఇచ్చిన మినిట్స్ కాపీలోని అంశాలు వెంటనే జీవోలు ఇవ్వాలని, గ్రాట్యూటీ అమలు చేసి, ఐఎల్సి సిఫారుసులు ప్రకారం కనీస వేతనాలు 26 వేలు పెన్షన్ అమలు చేయాలని, అంగన్వాడి ప్రీస్కూల్ బలోపేతం చేయాలి, 5 సంవత్సరాల లోపు పిల్లలు ప్రైవేట్ స్కూళ్లకు వెళ్లకుండా సర్కులర్ ఇవ్వాలి, 4 లేబర్ కోడ్ ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసిల్దార్ ఈరమ్మకు వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు రంగస్వామి, బాలకృష్ణ,అంగన్వాడి టీచర్స్ విశ్వకుమారీ, లత, విజయలక్ష్మి, గోవిందమ్మ, పద్మావతి, మస్తాంబి తదితరులు పాల్గొన్నారు.

# 'వీర మాస్'గా బాలయ్య



వీరసింహారెడ్డి, భగవంత్ కేసరి సినిమాలతో గత ఏడాది మంచి హిట్లు అందుకున్న టాలీవుడ్ సీనియర్ హీరో నందమూరి బాలకృష్ణ.. ఇప్పుడు అదే జోష్ లో బాబీ డైరెక్షన్ లో వర్క్ చేస్తున్నారు. వీరి కాంబోలో వస్తున్న సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై నాగవంశీ, సాయి సౌజన్య గ్రాండ్ గా నిర్మిస్తున్నారు. త్వరలోనే ఈ మూవీ రిలీజ్ కానుంది. అయితే సినిమాలో బాలయ్యను ఇప్పటి వరకు ఎవరూ చూపించని వైలెంట్ గా చూపిస్తానని డైరెక్టర్ బాబీ పలుమార్లు చెప్పారు. రీసెంట్ గా రిలీజ్ చేసిన గ్లింప్స్ లో చెప్పినట్లే చూపించారు. బాలయ్య పవర్ ఫుల్ గెటప్ లో కనిపించారు. సింహం నక్కల మీదకు వస్తే వార్ అవ్వదురా లఫూట్.. ఇట్స్ కాల్డ్ హంటింగ్ అంటూ బాలకృష్ణ తన మాస్ డైలాగ్ తో అలరించారు. యాక్షన్ తో అదరగొట్టేశారు. దీంతో సినిమాపై అంచనాలు భారీగా పెరిగిపోయాయి. గ్లింప్స్ తోపాటు టైటిల్ ను కూడా మేకర్స్ రివీల్ చేస్తారని అంతా అనుకున్నారు. కానీ ఎలాంటి అనౌన్స్మెంట్ రాలేదు. దీంతో ఇంకా వర్కింగ్ టైటిల్ NBK 109 తోనే మేకర్స్ షూటింగ్ ను పూర్తి చేస్తున్నారు. ఇప్పుడు ఈ మూవీ టైటిల్ ను ఫిక్స్ చేసినట్లు జోరుగా చర్చ సాగుతోంది. బాలయ్య మాస్ ఇమేజ్ కు తగ్గట్టు 'వీర మాస్' అనే టైటిల్ ను పరిశీలిస్తున్నారని కొద్ది రోజులుగా వార్తలు వస్తున్నాయి. ఇప్పుడు అదే టైటిల్ ను ఖరారు చేశారని టాక్. త్వరలో టైటిల్ తోపాటు మూవీ రిలీజ్ డేట్ ను మేకర్స్ అనౌన్స్ చేస్తారని సమాచారం. ప్రస్తుతం ఈ విషయం నెట్టింట వైరల్ గా మారింది. టైటిల్ అదిరిపోయిందని ఫ్యాన్స్ కామెంట్లు పెడుతున్నారు. మాస్ అనే పదానికి పర్ఫెక్ట్ ఎగ్జాంపుల్ బాలయ్య అని.. ఇప్పుడు ఆయన సినిమాకు వీర మాస్ టైటిల్ కన్ఫర్మ్ అయితే తిరుగులేదని అంటున్నారు. సోషల్ మీడియాలో వీర మాస్ అంటూ పోస్టులు పెడుతూ ట్రెండ్ చేస్తున్నారు. ఇక ఈ సినిమా విషయానికొస్తే.. శ్రద్ధా శ్రీనాథ్, ఊర్వశి రౌతేలా ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ విలన్ గా కనిపించనున్నారు. మాలీవుడ్ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ కీలక పాత్రలో నటిస్తున్నట్లు ఎప్పటి నుంచో వార్తలు వస్తున్నాయి. స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ తమన్ సంగీతం అందిస్తున్నారు. మరి డైరెక్టర్ బాబీ, నందమూరి నటసింహం ఈ మూవీతో ఎలాంటి హిట్ అందుకుంటారో వేచి చూడాలి.

సినీ వాయిస్ CINEMA

## రిలీజ్‌కు ముందే
# 'పుష్ప 2' రికార్డ్స్ బ్రేక్



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ "పుష్ప: ది రూల్". ఇది బ్లాక్ బస్టర్ హిట్టైన 'పుష్ప: ది రైజ్' చిత్రానికి సీక్వెల్. సినీ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సినిమా.. రిలీజ్ కు ముందే ఎన్నో సంచలనాలకు కేంద్ర బిందువుగా మారుతోంది. ఈ మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా మూవీ నాన్ థియేట్రికల్ రైట్స్ తోనే సరికొత్త రికార్డులు క్రియేట్ చేస్తోంది. తాజాగా ఈ సినిమా ఓటీటీ, శాటిలైట్ మరియు ఆడియో హక్కుల కోసం భారీ డీల్ కుదిరినట్లుగా తెలుస్తోంది. కోలీవుడ్ స్టార్ ప్రొడ్యూసర్ కెఇ జ్ఞానవేల్ రాజా తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. కేవలం 'పుష్ప 2' హిందీ వెర్షన్ నాన్ థియేట్రికల్ హక్కులే రూ. 260 కోట్ల భారీ రేటు పలికాయని చెప్పారు. దీని ప్రకారం ఇది ఇండియాలో ఏ భాషలోనైనా హయ్యెస్ట్ నాన్-థియేట్రికల్ డీల్ అని చెప్పాలి. ఇక 'కేజీఎఫ్ 2' కంటే అల్లు అర్జున్ సినిమా ఎక్కువ వసూళ్లు రాబడుతుందని తమిళ నిర్మాత అభిప్రాయపడ్డారు. నార్త్ ఇండియన్ మార్కెట్ లో 'పుష్ప: ది రూల్' మూవీ రికార్డులు బ్రేక్ చేస్తుందని, బాక్సాఫీస్ వద్ద భారీ కలెక్షన్లతో ఆకాశమే హద్దుగా చెలరేగిపోతుందని ఆయన అన్నారు. 'పుష్ప' పార్ట్-1లో 'పుష్ప.. పుష్పరాజ్.. తగ్గేదే లే' అంటూ అల్లు అర్జున్ తన మేనరిజంతో ఇండియన్ బాక్సాఫీస్ ను షేక్ చేసారు. ఇప్పుడు రెండో భాగం 'పుష్ప: ది రూల్' తో వరల్డ్ బాక్సాఫీస్ ను రూల్ చేయడానికి రెడీ అవుతున్నారు. ఇప్పుడు కెఇ జ్ఞానవేల్ రాజా సైతం అదే అభిప్రాయాన్ని వ్యక్తం చేసారు. జీనియర్ డైరెక్టర్ సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ యాక్షన్ మూవీపై అంచనాలు ఏ స్థాయిలో ఉన్నాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. పుష్ప రాజ్ లాంటి ఐకానిక్ క్యారక్టర్ ను తెరపై చూడటానికి సినీ ప్రియులు అందరూ ఆతృతగా వేచి చూస్తున్నారు. 'పుష్ప ది రైజ్' చిత్రంలో అల్లు అర్జున్ తన అద్భుతమైన నటనకుగాను బెస్ట్ యాక్టర్ గా నేషనల్ అవార్డ్ అందుకున్నారు. ఈ ఘనత సాధించిన మొట్ట మొదటి తెలుగు యాక్టర్‌గా నిలిచారు.

మోడల్ కం నటి నేహా మాలిక్ బికినీ బీచ్ విహారం గురించి తెలిలోసిందే. నేహా అన్ లిమిటెడ్ గ్లామర్ షో యువతరంలో నిరంతరం హాట్ టాపిక్. మోడల్ కం నటి నేహా మాలిక్ బికినీ బీచ్ విహారం గురించి తెలిలోసిందే. నేహా అన్ లిమిటెడ్ గ్లామర్ షో యువతరంలో నిరంతరం హాట్ టాపిక్. టూపీస్, స్విమ్ షూట్ ఏదైనా సరే బికినీ ట్రీట్ లో కిర్రెక్కించడం అమ్మడి స్పెషాల్టీ. ఆ విషయంలో ట్రెండ్ ని ఫాలో అవ్వడం కాదు. న్యూ ట్రెండ్ నే సృష్టిస్తుంది. చేతిలో సినిమాలు లేకపోయినా అంతటి ఫాలోయింగ్ ఎలా సాధ్యమంటే? ఇన్ స్టా క్రేజ్ తోనే దక్కించుకుం దన్నది అందిరికీ తెలిసిన వాస్తవం. తాజాగా అమ్మడు మరోసారి బీచ్ లో చెలరేగింది. సముద్ర స్నానం ఆచరిస్తూ అమ్మడు చీరందంలో చేసిన రచ్చ అంతా ఇంతా కాదు. తెలుపు వర్ణం సారీ, బ్లౌజ్ లో స్నానమాడుతూ తడి అందాలతో ముప్పేట దాడి చేసిందిలా. అమ్మడి స్కిన్ షో పీక్స్ లో హైలైట్ అవుతుంది. రకరకాల భంగిమల్లో కెమారాకి ఫోజులిచ్చి నెట్టింట పెద్ద దుమారమే రేపింది. నేహాలో వాడి వేడికి కుర్రాళ్లంతా ఫిదా అవుతున్నారు. ఇలా చీర ధరించి

# బీచ్‌లో చెలరేగిన హాట్ లేడీ!



బీచ్ లో అందాల వడ్డన చేయడం కూడా నేహాకి ఇదే తొలిసారి కావచ్చు అంటున్నారు ఫాలోవర్స్. మోడలింగ్ నుంచి గ్లామర్ ప్రపంచంలో అడుగుపెట్టింది. పంజాబీ చిత్రాలు సహా బాలీవుడ్ లోనూ నటిస్తోంది. మోడలింగ్ సహా నటిగా కెరీర్ ను ప్రారంభించింది. యుటివి బిందాస్‌లో 2013 లో ఫియర్లెస్ పేరుతో తన మొదటి సీరియల్ పాపులరైంది.

క్రీడా వాయిస్

# సుందర్ ఆల్‌రౌండ్ షో

## మూడో టి20లోనూ గెలుపే.. జింబాబ్వేపై 23పరుగుల తేడాతో ఘన విజయం



హరారే: ఐదు టి20ల సిరీస్ ఆడేందుకు జింబాబ్వే పర్యటనకు వెళ్లిన భారత యువ జట్టు అద్భుతంగా రాణిస్తోంది. తొలి టి20లో నిరాశపరిచినా.. రెండు, మూడు టి20ల్లో నెగ్గి సిరీస్ ఆధిక్యతలో నిలిచింది. హరారే వేదికగా జింబాబ్వేతో బుధవారం జరిగిన మూడో టి20లో టీమిండియా 23 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. భారత్ నిర్దేశించిన 183 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో జింబాబ్వే నిర్ణీత 20 ఓవర్లు పూర్తయ్యే సరికి 6వికెట్లు కోల్పోయి 159 పరుగులు చేసింది. డియోన్ మైయర్స్(65నాటౌట్, 49 బంతుల్లోబీ 7ఫోర్లు, సిక్సర్), క్లైవ్ మథండె (37, 26 బంతుల్లోబీ 2ఫోర్లు, 2సిక్సర్లు) బ్యాటింగ్‌లో రాణించారు. భారత బౌలర్లలో వాషింగ్టన్ సుందర్‌కు మూడు, అవేశ్ ఖాన్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 2-1తో ఆధిక్యతలో నిలిచింది. వాషింగ్టన్ సుందర్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాను కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (66, 49 బంతుల్లోబీ 7ఫోర్లు, 3సిక్సర్లు), రుతురాజ్ గైక్వాడ్ (49, 28 బంతుల్లోబీ 4ఫోర్లు, 3సిక్సర్లు) రాణించారు. ఓపెనర్ యశస్వీ జైస్వాల్ (36, 27 బంతుల్లోబీ 4ఫోర్లు, 2సిక్సర్లు) ఆకట్టుకున్నాడు. రెండో టి20లో సెంచరీతో కదం తొక్కిన అభిషేక్ శర్మ(10) నిరాశపరిచాడు. గిల్‌తో ఓపెనర్‌గా వచ్చిన జైస్వాల్ తొలి ఓవర్లోనే రెండు ఫోర్లు, సిక్సర్‌తో తన ఉద్దేశాన్ని చాటాడు. రెండో ఓవర్లో గిల్ సైతం 4, 6, 4తో భారత్ స్కోరు రాకెట్ వేగాన్నితలపించింది. ఈ ఇద్దరూ దూకుడుగా ఆడటంతో 8ఓవర్లు ముగిసేసరికే భారత్ వికెట్ నష్టపోకుండా 67పరుగులు చేసింది. తొమ్మిదో ఓవర్లో రజా వేసిన బంతిని స్వీప్ చేయబోయిన జైస్వాల్.. బెన్నెట్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరగడంతో భారత్ తొలి వికెట్ కోల్పోయింది. వన్‌డౌన్‌లో వచ్చిన అభిషేక్ ఈ మ్యాచ్‌లో తేలిపోయాడు. కానీ రుతురాజ్ అండతో గిల్ రెచ్చిపోయాడు. మధ్వెరె వేసిన 13వ ఓవర్లో గిల్ ఓ సిక్సర్ బాదగా రుతురాజ్ 6,4 సాధించాడు. చటారా 14వ ఓవర్లో ఫోర్ కొట్టిన గిల్ 36 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తిచేసుకున్నాడు. ధాటిగా ఆడే క్రమంలో గిల్.. ముజర్బని వేసిన 18వ ఓవర్లో రజాకు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. కానీ ఆఖర్లో రుతురాజ్ వేగంగా ఆడటంతో భారత్ భారీ స్కోరు చేసింది. అర్ధ సెంచరీకి ఒక్క పరుగు దూరంలో రుతురాజ్ ఔట్ అయి నిరాశగా పెవిలియన్‌కు చేరాడు. జింబాబ్వే బౌలర్లలో కెప్టెన్ సికిందర్ రాజా, బ్లెస్సింగ్ ముజర్బనికి రెండేసి వికెట్లు దక్కాయి. నాల్గో టి20 శనివారం జరగనుంది.

# సెమీస్‌కు రైబకినా, క్రేజికోవా



## వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ

లండన్: వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ మహిళల సింగిల్స్ సెమీఫైనల్లోకి 4వ సీడ్ రైబకినా(కజకిస్తాన్), 31వ సీడ్ క్రేజికోవా(చెక్ రిపబ్లిక్) ప్రవేశించారు. బుధవారం జరిగిన తొలి క్వార్టర్‌ఫైనల్లో రైబకినా 6-3, 6-2తో 21వ సీడ్ స్విటోలినా(ఉక్రెయిన్)ను చిత్తుచేయగా.. క్రేజికోవా 6-4, 7-6(7-4)తో 13వ సీడ్ ఒస్టాపెంకో(లాత్వియా)ను ఓడించింది.

ఇక పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లోకి 2వ సీడ్, సెర్బియాకు చెందిన నొవాక్ జకోవిచ్ ప్రవేశించాడు. బుధవారం జకోవిచ్-డి-మినర్ మధ్య జరగాల్సిన మ్యాచ్ జరగలేదు. క్వార్టర్స్ మ్యాచ్‌కు ముందు గాయం కారణంగా డి-మినర్ వైదొలగడంతో జకోవిచ్‌ను విజేతగా ప్రకటించారు.

సింగిల్స్ సెమీఫైనల్స్

మహిళలు.. పురుషు క్రేజికోవా ఐ రైబకినా మెద్వదెవ్ ఐ అల్కరాజ్

వేకిక్ ఐ పోలిని జకోవిచ్ ఐ మసెట్టి/ఫ్రిట్జ్(మ్యాచ్ విజేత)

## పారిస్ ఒలింపిక్స్ ఏర్పాట్లపై
# జాతీయ ఒలింపిక్ జట్ల పెదవి విరుపు
## ఎసిల స్థానంలో కూలింగ్ ఏర్పాట్లు

పారిస్ ఒలింపిక్స్ మరో రెండు వారాల్లో ప్రారంభం కానుండగా.. అక్కడి ఏర్పాట్లు జాతీయ ఒలింపిక్ జట్లకు ఆందోళన కలిగిస్తున్నాయి. జూన్ నెలాఖరు నుంచే అథ్లెట్లు ఇక్క డికి విచ్చేస్తున్నా.. పారిస్ ఒలింపిక్ విలేజ్‌లో ఎసిలకు బదులు తాత్కాలిక కూలింగ్ యూనిట్లను ఏర్పాటు చేస్తున్నారు. సుమారు 2,500 తాత్కాలిక కూలింగ్ యూనిట్లను ఏర్పాటు చేసినట్లు పారిస్ ఒలింపిక్ నిర్వాహకులు మంగళవారం తెలిపారు. ఈ కూలింగ్ యూనిట్లను భూమి లోపలనుంచి అమర్చడం వల్ల చల్లదనంలో సమతుల్యతలు ఏర్పడే అవకాశముందని అథ్లెట్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నిర్ణయం పారిస్ నిర్వాహకులు ఈ ఏడాది మార్చిలోనే నిర్ణయించగా.. జాతీయ ఒలింపిక్ జట్లనుంచి ఈ నిర్ణయంపై తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. అక్కడి నిర్వాహకులు జాతీయ ఒలింపిక్ జట్ల వ్యతిరేకతను పట్టించుకోకుండా తమ పనుల్లో నిమగ్నమైపోయారు. పారిస్ ఒలింపిక్స్‌లో మొత్తం 7వేల గదులను ఏర్పాటు చేశారు. అమెరికా ఒలింపిక్, పారాలింపిక్స్ సిఇవో సారా హిర్ష్‌లాండ్ మాట్లాడుతూ.. అథ్లెట్ల కోసం జర్మనీ, ఆస్ట్రేలియా, ఇటలీ, కెనడా, బ్రిటన్‌లనుంచి ఎసిలను పారిస్ ఒలింపిక్స్ నిర్వాహకులు కొనుగోలు చేయాల్సి ఉన్నా.. అధిక ఖర్చులకు భయపడి తాతాల్కిక కూలింగ్ యూనిట్లను ఏర్పాటు చేస్తున్నాయని తెలిపారు. ఒలింపిక్ విలేజ్‌ను మీడియా సందర్శించగా.. అథ్లెట్ల సౌలభ్యం కోసం 2,500 ఏసీలను కొనుగోలు ఆదేశించామని అక్కడి నిర్వాహకులు తెలిపారు. ఒలింపిక్స్ ఖర్చు ఎంతైనా వెనక్కి తగ్గేది లేదని గతంలో పారిస్ మేయర్ అన్నే హిడాల్గో వెల్లడించారు. పారిస్ ఒలింపిక్స్ జులై 26నుంచి ఆగస్టు 11 వరకు, పారాలింపిక్స్ సెప్టెంబర్‌లో జరగనున్నాయి.

విశ్వం వాయిస్ తెలుగు దినపత్రికలో వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...

- భక్తి వాయిస్
- బిజినెస్ వాయిస్
- సినీ వాయిస్
- క్రైం వాయిస్
- హెల్త్ వాయిస్
- కిసాన్ వాయిస్
- విద్యా వాయిస్
- సక్సెస్ వాయిస్
- వనిత వాయిస్
- కిడ్స్ వాయిస్
- తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603, viswamvoice@gmail.com